JANASAMAYAM FORTNIGHTLY

TGTEL/26/A2074

# జన సమయం

## సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:1 సంచిక:11 16-30 సెప్టెంబర్ 2026 ఎడిటర్: వి. యాదమ్మ పేజీలు:52 వెల:20/-



# కోయిలకొండలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీలు



మహబూబ్‌నగర్ (జనసమయం విలేకరి):కోయిలకొండ మండల పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మండల కేంద్రంలోని ఎం.పి.డి.ఓ కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి.హెచ్.సి), బి.సి బాలుర సంక్షేమ వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాలు, సంస్థల్లో అందుతున్న సేవలు, సిబ్బంది హాజరు, వైద్య సేవలు, మందుల లభ్యత, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు. ఎం.పి.డి.ఓ కార్యాలయంలో పిటిషన్లు, సిబ్బంది హాజరు పరిశీలన ముందుగా ఎం.పి.డి.ఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన పిటిషన్లు, దరఖాస్తులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆన్‌లైన్‌లో నమోదవుతున్న హాజరు వివరాలను తనిఖీ చేశారు. డైలీ సిట్యుయేషన్ రిపోర్ట్ (డి.ఎస్.ఆర్), ఫేస్ రికగ్నిషన్ ద్వారా నమోదవుతున్న హాజరు వివరాలను ఎం.పి.డి.ఓ లాగిన్‌లో పరిశీలించారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన బూరుగుపల్లి సర్పంచ్‌తో కలెక్టర్ మాట్లాడి గ్రామంలో పెండింగ్ బిల్లులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, నిధుల వినియోగం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ యాప్‌లో నమోదైన వివరాలు, వివిధ పథకాల అమలు, నిధుల వినియోగానికి సంబంధించిన అంశాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత వివరాలను ఎం.పి.డి.ఓ ద్వారా సర్పంచ్‌కు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.సర్పంచ్ తెలిపిన చెక్కులపై సంతకాల సమస్యపై ఉపసర్పంచ్‌ను పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఎం.పి.డి.ఓకు సూచించారు. సి.హెచ్.సిలో వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా అనంతరం జిల్లా కలెక్టర్ సి.హెచ్.సి సందర్శించి ఆసుపత్రిలోని రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు.కొంతమంది రోగులు ఐరన్ మాత్రలు, ఇన్సులిన్ ఇంజెక్షన్లు అందుబాటులో లేవని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ వెంటనే స్పందించారు. జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి ఇన్సులిన్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వెంటనే స్పందించి ఇన్సులిన్‌ను తెప్పించి సంబంధిత రోగికి అందించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల స్టాక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. బి.సి బాలుర సంక్షేమ వసతి గృహంలో వసతులు, ఆహారం పరిశీలన అనంతరం కలెక్టర్ బి.సి బాలుర సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని ఆరా తీసిన కలెక్టర్, ఉదయం అందించిన అల్పాహారం వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.

### పాఠశాలలో పారిశుద్ధ్యం, విద్యార్థుల సౌకర్యాల పరిశీలన

అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాల పరిసరాలను పరిశీలించారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నారా, గతంలో ఎప్పుడు ఫాగింగ్ చేపట్టారనే వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. అక్కడ ఉన్న సర్పంచ్‌ను పంచాయతీ కార్యదర్శి క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి తరగతి గదిని



సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తరగతి గదిలో ఫ్యాన్ పనిచేయకపోవడాన్ని గమనించిన ఆమె, వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచి వాతావరణంలో విద్యాబోధన జరిగేలా చూడాలని సూచించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని, మురుగు కాలువలను నిత్యం శుభ్రం చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన పదార్థాలు విక్రయించకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కోయిలకొండ ఎం.పి.డి.ఓ ధనుంజయరావు, ఇతర మండల అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A2074

# జన సమయం

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

H.No. 4-42-332, Chennareddy Nagar, Asbestos Colony, Hyderabad (TG) 500037

సంపుటి : 01 సంచిక :11 16-30 సెప్టెంబర్ 2026 పేజీలు : 52 వెల : 20/-

లోపల పేజీలో....

| | |
|---|---|
| పొలిటిక్స్ లోకి | 6 |
| పక్కా వ్యూహంతో | 8 |
| రైతుల గగ్గోలు.. | 11 |
| ఉద్యమాల గడ్డ నుంచే | 12 |
| రామప్పను కబళిస్తున్న | 17-18 |
| ఢిల్లీ గడ్డపై బ్రిక్స్ బిగ్ | 26 |
| 1000 రోజుల పాలనపై | 27 |
| 22ఏ భూముల | 33 |
| వ్యవసాయ విద్యుత్ కోసం | 36 |
| విద్యా శాఖపై | 39 |
| రాజ్యాంగం | 40-43 |
| సాహిత్యం | 44 |
| ఆరోగ్యం | 46 |
| క్రీడలు | 48 |
| సినిమా | 49 |

Editor, Publisher & Owned By :
**V. YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal
Wanaparthy Dist.Telangana-509380

Editor :
**V. YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal
Wanaparthy Dist.Telangana -509380
Cell : 9381205266
email : janasamayam@gmail.com

Printer : **VARDA YADAIAH**
Printed at : Mythri Art Printers,
Shop No. 10, Dcc Bank Complex,
Mahabubnagar,Telangana-509001.

Place of Publication **V.YADAMMA**
H.No. C154,Parvathapur Village,
Ghanapur Mandal, Wanaparthy Dist.
Telangana -509380
Cell : 9381205266

*Ads Manging Director*
**Panditi Prudhvi Kumar Reddy**
Cell : 8977022449

## సంపాదకీయం

# వ్యవసాయానికి డేంజర్ బెల్స్...

దేశం మొత్తం మీదా వర్షం పరిస్థితి ఆశాజనకంగా లేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా దేశంలో సుమారు 870 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ సెప్టెంబర్ మొదటి వారం నాటికి సీజనల్ వర్షపాతం సాధారణం కంటే 13 శాతం తక్కువగా ఉంది. జూన్‌లో ఏకంగా 35 శాతం లోటు నమోదైంది. జూలైలో కొంత వర్షం పుంజుకున్నా.. ఆగస్టులో మళ్లీ 16 శాతం లోటు వచ్చింది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణ ద్వీపకల్పంలో దాదాపు 27 శాతం వర్ష లోటు ఉంది. అంటే తెలంగాణ, ఏపీ సహా దక్షిణాది ప్రాంతాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉంది. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉండటంతో.. ఈసారి నైరుతి సీజన్ దేశవ్యాప్తంగా లోటుతో ముగిసే పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణ మార్పులు, రుతుపవనాల తీరు, ఎల్‌నినో వంటి ప్రభావాలు కూడా వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి.వ్యవసాయం ఇప్పటికీ వానపై చాలా వరకు ఆధారపడి ఉంది. నైరుతి రుతుపవనాల సమయంలో వచ్చే వర్షాలే చెరువులను నింపాలి. వాగులు, వంకల్లో నీరు పారాలి. భూగర్భ జలాలు పెరగాలి. బోర్లలో నీరు ఉండాలి. ప్రాజెక్టులకు నీరు చేరాలి. అప్పుడే రైతు పొలంలో పంట నిలబడుతుంది. కానీ ఈసారి కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి తేడాగా ఉంది. ఒకవైపు వర్షం తక్కువగా పడుతోంది. మరోవైపు పడిన వాన కూడా ఒకే ప్రాంతంలో కురుస్తోంది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతున్నా.. మరికొన్ని ప్రాంతాల్లో చినుకులు కూడా కరువవుతున్నాయి. దీంతో రాష్ట్ర సగటు లెక్క కంటే గ్రామం, మండలం స్థాయిలో రైతు ఎదుర్కొంటున్న కష్టం ఎక్కువగా కనిపిస్తోంది.వర్షం తగ్గితే మొదట నేలలో తేమ తగ్గుతుంది. తర్వాత చెరువుల్లోకి వచ్చే నీరు తగ్గుతుంది. చెరువులు నిండకపోతే భూగర్భ జలాలు పెరగవు. బోర్లు ఎండిపోతే రైతు ప్రాజెక్టుల వైపు చూస్తాడు. అక్కడి నుంచి కాలువల ద్వారా నీరు రావాలి. కాలువ చివరి ఆయకట్టులో ఉన్న రైతు పొలానికి కూడా నీరు చేరాలి. అప్పుడే ప్రాజెక్టులో ఉన్న నీరు రైతుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ నీటి అసలు లెక్క మొదలవుతుంది. ప్రాజెక్టుల్లో నీరు ఉండటం ఒక లెక్క. ఆ నీరు పొలానికి చేరడం మరో లెక్క. వర్షం తక్కువైతే రైతు కష్టం అక్కడితో ఆగదు. విత్తనం కొనాలి. ఎరువులు వేయాలి. మందులు కొనాలి. కూలీలకు డబ్బులు ఇవ్వాలి. నీరు లేకపోతే బోరు నడపాలి. విద్యుత్ ఖర్చు పెరుగుతుంది. పంట నిలబడకపోతే మళ్లీ విత్తనం వేయాల్సి వస్తుంది. ఇలా వాన తగ్గిన ప్రతి దశలో రైతు ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి వేసిన పంట ఎండిపోతే మరోసారి పెట్టుబడి పెట్టాలి. రెండోసారి కూడా వాన రాకపోతే మరోసారి అప్పు చేయాల్సి వస్తుంది. చివరికి ఆకాశంలో పడని వాన..రైతు జేబులో అప్పుగా మారుతుంది. మరో వైపు ప్రాజెక్టుల నీటిపై రాజకీయ రచ్చ మొదలవుతోంది. ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టు వచ్చిందని అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయ పార్టీలకు నీరు ఒక రాజకీయ అంశం కావచ్చు. కానీ రైతుకు మాత్రం నీరు జీవనాధారం. పంటకు నీరు రావాలి. పంట చేతికి రావాలి. పంటకు గిట్టుబాటు ధర రావాలి. అప్పు తీర్చాలి. ఇంటిని నడపాలి. రైతు ఆలోచన ఇలానే సాగుతోంది.

V. Yadamma

# బాపు టార్గెట్ తో గులాబీ దళం యాక్టివ్



హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను టార్గెట్ చేయడం వల్ల కాంగ్రెస్‌కు లాభమా లేదా నష్టమా అనేది చర్చనీయాంశమైంది. నేటికీ కేసీఆర్ పట్ల తెలంగాణను తెచ్చారన్న అభిప్రాయం ఉంది. ఆయన పాలన శైలి నచ్చకపోవచ్చు కానీ, ఆయనంటే తెలంగాణ ప్రజలకు గౌరవం అనేది తరగనిది. కానీ కాంగ్రెస్ ఇటీవల కాలంలో కేసీఆర్ ను లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం రాజకీయం గానష్టమేనన్న అంచనాలు వినపడుతున్నాయి . కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ తాము కేసీఆర్ చావును కోరుకుంటున్నామని చెప్పడం, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ ముట్టడికి ప్రయత్నించడం వంటివి బీఆర్ఎస్ కు కలసి వచ్చే అంశమని భావిస్తున్నారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమ నేతగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి. ఆయనపై వ్యక్తిగత విమర్శలు లేదా తీవ్రమైన దాడులు ప్రజల్లో ఆయన పట్ల సానుభూతి నిపెంచే అవకాశం ఉంది.అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఆరు గ్యారంటీలు, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా, కేవలం ప్రతిపక్ష నేతను వేధించడానికే ప్రాధాన్యత ఇస్తోందనే అభిప్రాయం సాధారణ ప్రజల్లో బలపడితే అది కాంగ్రెస్‌కు రాజకీయంగా నష్టం కలిగిస్తుంది. కేసీఆర్ శాసనసభకు రాకుంటే, ప్రజాసమస్యలను ప్రస్తావించకుంటే ఆయనకే నష్టం. ఎన్నికల సమయంలో జనం తగిన రీతిలో తీర్పు చెబుతారు. కేసీఆర్ కేవలం అసెంబ్లీ సమావేశాలకు మాత్రేమే కాదు...ప్రజా సమస్యలపై రాష్ట్రంలో పర్యటించలేదు. కానీ కేసీఆర్ సభకు రాలేదంటూ నిరసనలు తెలియజేయడం, ఎమ్మెల్సీ స్పీకర్ ను తిడితే ఫామ్ హౌస్ ముట్టడికి ప్రయత్నించడం కొంత కాంగ్రెస్ కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.. కేసీఆర్‌ను టార్గెట్ చేయడం వల్ల నిస్తేజంగా ఉన్న బీఆర్ఎస్ కేడర్ ఒక్కసారిగా అప్రమత్తమై, కాంగ్రెస్ సర్కార్‌పై ఎదురుదాడికి దిగే అవకాశం ఉంది.అయితే కాంగ్రెస్‌కు లాభం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయంటున్నారు. కాంగ్రెస్ ఎజెండా ప్రకారం బీఆర్ఎస్, కేసీఆర్‌లను నిరంతరం టార్గెట్ చేయడం ద్వారా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్సేనని, బీజేపీకి అక్కడ చోటు లేదనే సంకేతాన్ని ప్రజల్లోకి పంపవచ్చు. దీనివల్ల ప్రతిపక్ష ఓట్లు చీలిపోకుండా చూసుకోవచ్చు కేసీఆర్ హయాంలో జరిగిన లోపాలను (ఉదాహరణకు కాళేశ్వరం ప్రాజెక్టు సమస్యలు, ధరణి లోపాలు) నిరంతరం ప్రస్తావించడం ద్వారా, తాము ఎందుకు అధికారంలోకి రావాల్సి వచ్చిందో ప్రజలకు కాంగ్రెస్ సమర్థించుకోగలుగుతుంది. తమ నాయకత్వం బలంగా ఉందని, కేసీఆర్ వంటి సీనియర్ నేతను సైతం ఢీకొట్టగలదని చూపించడం ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలలో ధైర్యాన్ని నింపవచ్చు. .. రాజకీయంగా విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ, అది వ్యక్తిగత దూషణలు, శృతిమించిన దాడుల స్థాయికి వెళ్తే మాత్రం కాంగ్రెస్‌కు నష్టం జరిగే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలు ఎప్పుడూ ప్రస్తుత ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలును బట్టే తీర్పు ఇస్తారు కానీ, కేవలం ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడం వల్ల మాత్రమే ఓట్లు పడవు.

# పొలిటిక్స్ లోకి హైడ్రా రంగనాథ్.. పోటీ అక్కడి నుంచే..



హైదరాబాద్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో చెరువులు.. కుంటలు.. నాలాల ఆక్రమణ లేకుండా హైడ్రా అనే వ్యవస్థను తెరమీదకు తీసుకొచ్చారు. దీనికి కమిషనర్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ ను నియమించారు.రంగనాథ్ కు ముక్కుసూటిగా పని చేస్తారు అనే పేరు ఉంది. పైగా ఆయన గతంలో తెలంగాణలో అనేక ప్రాంతాలలో పోలీసు ఉన్నతాధికారిగా పని చేశారు. అనేక కీలకమైన కేసులను సాల్వ్ చేశారు. భూ అక్రమలకు పాల్పడే వ్యక్తుల గుండెల్లో నిద్రపోయారు. అంతటి కేసీఆర్ కూడా వరంగల్ లాంటి నగరానికి కమిషనర్ పోలీస్ గా రంగనాథ్ ను నియమించారు.రంగనాథ్ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రిక హైడ్రాకు కమిషనర్ గా వ్యవహరిస్తున్నారు. అనేక చెరువులను రక్షించారు. కుంటలను బాగు చేశారు. నాలాలను పరిరక్షించారు. ఒక ముక్కలో చెప్పాలంటే విప్లవాత్మక విధానాలకు శ్రీకారం చుడుతున్నారు. కోర్టుల ద్వారా కొంతమంది వ్యక్తులు ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నప్పటికీ.. రంగనాథ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి బలమైన సపోర్టు లభిస్తుంది. ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు సవాల్ చేస్తూ మళ్ళీ ప్రభుత్వం హైకోర్టులో వేరే బెంచ్ ను ఆశ్రయించడంతో రంగనాథ్ మీద వచ్చిన వ్యతిరేకత ఒక్కసారిగా పత్తా లేకుండా పోయింది.రంగనాథ్ గురించి ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఒకటి చర్చకు దారి తీస్తోంది. హైదరాబాద్ నగరంలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి రంగనాథ్ హాజరయ్యారు. ఈ సమయంలో కూటమిలో ఉన్న నాయకులు మొత్తం హాజరు కావడం విశేషం. ఎంపీలు సానా సతీష్.. లక్ష్మణ్.. ఇంకా మున్నూరు కాపు సామాజిక వర్గంలో కీరకమైన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వంటి వారి హాజరయ్యారు. దానికి రంగనాథ కూడా హాజరయ్యారు. వాస్తవానికి కుల సంఘాల సమావేశాలకు.. ఇతర భేటీలకు రంగనాథ్ హాజరవుతూనే ఉంటారు. ఈ విషయంలో ఆయన మీద విమర్శలు ఉన్నప్పటికీ పట్టించుకోరు. అయితే కూటమిలో ఉన్న ఎంపీలు. ఇతర నాయకులు హాజరైన నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో రంగనాథ్ ఎంపీగా పోటీ చేస్తారని తెలుస్తోంది.ఏపీలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఆయన బరిలో ఉంటారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి పోలీసు అధికారులు రాజకీయ నాయకులుగా మారిన ఉదాహరణలు అనేక ఉన్నాయి. దీనికి రంగనాథ్ మినహాయింపు కాదు. పైగా రంగనాథ్ కు కూడా పొలిటికల్ లక్ష్యాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ ప్రకారం చేసుకుంటే వచ్చే ఎన్నికల్లో కూటమి లో ఉన్న ఏదో ఒక పార్టీ నుంచి ఆయన పోటీ చేసే అవకాశం ఉంది. గతంలో ఆయన పవన్ కళ్యాణ్ ను కలిశారు. చిరంజీవి కుటుంబానికి అత్యంత ఆప్తుడిగా ముద్రపడ్డారు. ఈ నేపథ్యంలో జనసేనలో చేరి.. ఎంపీగా పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి తెలుస్తోంది. అయితే ఇది ప్రచారమేనా.. ఊహగానామా అనేది త్వరలోనే తేలనుంది.

# కొండా దెబ్బకు రాజ్ గోపాల్ రెడ్డి యూ టర్న్..





హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్‌లో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తరచుగా మీడియాలో ఉంటున్నారు. తనకు మంత్రి పదవి దక్కలేదని ఆక్రోశిస్తున్న ఆయన.. దానిని ఎలాగైనా సాధించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. అయితే.. ఈ క్రమంలో ఆయన సామ, దాన, బేధ, దండోపాయాల్లో కుదిరిన సమయంలో కుదిన దానిని వినియోగిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు బేధోపాయాన్ని(వైరం) అనుసరించారు. సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారుమునుగోడులో సొంత అధికారం చలాయిస్తున్నారు. బెల్టు షాపులు నిర్వహించేది లేదన్నారు బాగానే ఉంది. కానీ.. ప్రభుత్వం ఇచ్చే లైసెన్సులు తెచ్చుకున్న మద్యం దుకాణాలపైనా ఆయన ఆంక్షలు పెట్టారు. అధికారులపై చిందులు తొక్కారు. కానీ, తాజాగా ఇప్పుడు రూటు మార్చేశారు. తాజా మాజీ మంత్రి కొండా సురేఖపై పార్టీ వ్యవహరించిన తీరుతో కంగుతిన్న రాజగోపాల్ రెడ్డి ఏకంగా సామ మార్గం(బుజ్జగించడం)పట్టారు.. అబ్బే నేను సీఎం ను ఏమీ అనలేదని.. అదంతా తనంటే గిట్టని ఓ మీడియా చేసిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌తో తనకు ఎప్పుడూ ఎలాంటి పేచీ పంచాయితీలు లేవని కూడా రాజగోపాల్ వ్యాఖ్యానించారు. అంతే కాదు.. రేవంత్ రెడ్డి వంటి బలమైన నాయకుడి కారణంగానే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని.. మళ్లీ మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఆశ్చర్యం లేదన్నారు. ఇక్కడితో కూడా ఆగకుండా.. మునుగోడు నియోజకవర్గానికి 2 వేల కోట్ల రూపాయల నిధులు కూడా కేటాయించారని.. తద్వారా అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయన్నారు. కానీ, రెండు మాసాల కిందట తన నియోజకవర్గం పాకిస్థాన్‌లో ఏమైనా ఉందా? అని ఇదే రాజగోపాల్ ప్రశ్నించడం గమనార్హం.ఇక, ఇప్పుడు మరో మాట కూడా చెప్పుకొచ్చారు. త్వరలో జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు తన నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని రాజగోపాల్ చెప్పడం గమనార్హం. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారం తేలిపోయిన దరమిలా.. నిన్న మొన్నటి వరకు ఎగిరి పడిన చాలా మంది నాయకులు లైన్‌లోకి వచ్చేస్తున్నారు. కొందరు ఇంటి నుంచి బయటకు కూడా రాకపోగా.. మరికొందరు మీడియాకు ముఖం చాటేస్తున్నారు. ఈ జాబితాలో ఇప్పుడు కోమటిరెడ్డి చేరిపోయారు. మరి మున్ముందు.. ఈ శాంతి వచనాలు ఇలానే కొనసాగుతాయో లేదో చూడాలి.

# పక్కా వ్యూహంతో కాంగ్రెస్



హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకునే రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ టాప్ లీడర్‌షిప్ నే లక్ష్యంగా చేసుకుంటాయనే విషయం మరోసారి రుజువైంది. గత మూడు రోజులుగా తెలంగాణ శాసనసభ లోపల, బయట చోటుచేసుకున్న రచ్చ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు, అసెంబ్లీ గేట్ వద్ద పోలీసులతో జరిగిన తోపులాటలు కేవలం కొందరు ఎమ్మెల్యేల తొందరపాటు చర్య కాదని సీఎం రేవంత్ శాసనసభ వేదికగా బాంబు పేల్చారు. ఈ మొత్తం హైడ్రామా వెనుక ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వేదికగా జరిగిన నేరపూరిత కుట్ర ఉ ందంటూ, నేరుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నే సూత్రధారిగా వేలెత్తి చూపడం ద్వారా గులాబీ దళానికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు.అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం కేవలం ఒక రాజకీయ విమర్శ మాత్రమే కాదు. దానికి పక్కా లీగల్ అండ్ పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేశారు. సెప్టెంబర్ 6న ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన అంతర్గత సమావేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల మార్కును, అసెంబ్లీ సమావేశాలను అడ్డుకోవడానికి ప్లాన్ సిద్ధమైందని రేవంత్ ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేతను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, పోలీసుల విధులకు భంగం కలిగించడం వెనుక సభను అస్థిరపరిచే పక్కా వ్యూహం ఉందన్నారు. దీనిని కేవలం సభా నిబంధనల ఉల్లంఘనగా కాకుండా, ఎఖఅ, ఃఔ కింద నేరపూరిత కుట్రగా పరిగణిస్తూ దర్యాప్తుకు ఆదేశించడం కాంగ్రెస్ వేసిన మాస్టర్ స్ట్రోక్.ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం లీగల్‌గా సీరియస్‌గా తీసుకుంది. హైదరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ నేతృత్వంలో విచారణ జరిపించి, ఫామ్‌హౌస్ సమావేశానికి హాజరైన నేతలు, అక్కడి నుంచి వచ్చిన సూచనలు, అసెంబ్లీ వద్ద జరిగిన భౌతిక దాడుల మధ్య ఉన్న లింకులను టెక్నికల్, ఫోరెన్సిక్ ఆధారాలతో సేకరించాలని ఆదేశించారు. సీనియర్ ఐపీఎస్ పర్యవేక్షణలో జరిగే ఈ కుట్ర కోణం దర్యాప్తు.. రేపు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి, విచారణకు పిలిచే వరకూ వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవేళ కేసీఆర్‌ను లేదా ఆయన ప్రధాన అనుచరులను విచారిస్తే, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడటం ఖాయం.కాంగ్రెస్ సర్కార్ వేసిన ఈ బిగ్ ట్రాప్ నుంచి బయటపడటం బీఆర్ఎస్‌కు అతిపెద్ద సవాలే. బీఆర్ఎస్ ఇప్పటికే ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకు లీగల్ , విక్టిమ్ కార్డ్‌ను వాడుతోంది. అసెంబ్లీ గేట్ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల, సీనియర్ నేతల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టును, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి పోలీస్ యంత్రాంగాన్ని రక్షణలో పడేసే ప్రయత్నం చేస్తోంది. రేవంత్ రెడ్డి కావాలనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కేసీఆర్ పేరును లాగుతున్నారని బీఆర్ఎస్ వాదిస్తోంది. రేవంత రెడ్డి ఆడిన ఈ గేమ్‌తో ప్రతిపక్షం అనుకున్న అజెండా పూర్తిగా దారి తప్పింది. కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలు , ఆరు గ్యారెంటీలు అంశాలపై చార్జ్‌షీట్ ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావించిన బీఆర్ఎస్.. ఇప్పుడు కేసీఆర్ కుట్ర – దళిత స్పీకర్‌కు అవమానం అనే కొత్త కాంగ్రెస్ నెరేటివ్‌ను డిఫెండ్

చేసుకునే పనిలో పడింది. కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్సీల సస్పెన్షన్ల చుట్టూ తిరిగిన చర్చను రేవంత్ రెడ్డి ఒక్క దెబ్బతో నేరుగా కేసీఆర్ వర్సెస్ కాంగ్రెస్ సర్కార్ గా మార్చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయాల్లో చిన్న చిన్న నేతలతో కాలక్షేపం చేయకుండా, నేరుగా ప్రధాన ప్రత్యర్థి మూలాలనే దెబ్బకొట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. విచారణ పేరుతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను ఈ కేసులోకి లాగడం ద్వారా బీఆర్ఎస్ అగ్రనాయకత్వాన్ని మానసికంగా, లీగల్‌గా ఒత్తిడికి గురిచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధించింది. రాబోయే రోజుల్లో ఈ సీనియర్ ఐపీఎస్ విచారణ ఏ మలుపు తిరుగుతుందో, గులాబీ దళం దీనికి ఎలా బదులిస్తుందో వేచి చూడాలి.

# సొంత ప్రభుత్వంపై 'రాములమ్మ' నిప్పులు!

## మేము పోరాడకుంటే మీరు సీఎంలు, మంత్రులు అయ్యేవారా?

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

## శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ధ్వజం.

తెలంగాణ శాసన మండలి వేదికగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ విజయశాంతి తన సొంత ప్రభుత్వంపైనే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరిపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలి సమావేశాల్లో భాగంగా జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా.. మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన కీలక హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ×ఉద్యమకారులు లేకపోతే మీ పదవులు ఎక్కడివి?×సభలో విజయశాంతి తన మార్క్ యాక్షన్ స్టైల్‌లో ప్రసంగిస్తూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "తెలంగాణ ఉద్యమకారులు నాడు రోడ్లపైకి వచ్చి, లాఠీ దెబ్బలు తిని, జైళ్లకు వెళ్లకుంటే ఈరోజు ప్రత్యేక రాష్ట్రం వచ్చేదా? ఆనాడు వారు చేసిన పోరాటం వల్లే కదా ఇవాళ మీరు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా చలామణి




అవుతున్నారు. ఆ ఉద్యమకారులను విస్మరిస్తే ఊరుకునేది లేదు" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు, ప్రభుత్వ పెన్షన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను తక్షణమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ×ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీపై 'క్వాలిటీ' అస్త్రం..×ఉద్యమకారుల అంశంతో పాటు రాష్ట్రంలో పేద ప్రజారోగ్యంపై విజయశాంతి ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులు సామాన్యులను పీల్చి పిప్పి చేస్తున్నాయని మండిపడ్డారు. ఆరోగ్య రంగంలో ప్రభుత్వం 'క్వాలిటీ' (నాణ్యత) పెంచాల్సిన అవసరం ఉందని, వైద్య సేవలు అందక పేదలు అల్లాడుతుంటే చూస్తూ ఊరుకోలేమని స్పష్టం చేశారు. స్వపక్షాన్ని ఉద్దేశించి ఆమె చేసిన ఈ సంచలన వ్యాఖ్యలతో సభ ఒక్కసారిగా నిశ్శబ్దంలో మునిగిపోయింది. ప్రతిపక్ష సభ్యులు సైతం రాములమ్మ వ్యాఖ్యలకు మద్దతుగా డెస్కులు చరిచారు. మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలను సొంత పార్టీ ఎమ్మెల్సీయే ఎండగట్టడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించం..మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,శాసనసభలో ఆర్టీసీ పై పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు రైల్వేలు దేశవ్యాప్తంగా లైఫ్లైన్ అయితే.. తెలంగాణ ప్రజలకు ఆర్టీసీ లైఫ్లైన్. ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతూ, 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. గత ప్రభుత్వం పదేళ్లలో ఆర్టీసీని నిర్లక్ష్యం చేసి సంస్థను నిర్వీర్యం చేశారని అన్నారు.రిటైర్డ్ ఈడీని ఎండీగా నియమించి సంస్థ నిర్వహణను బలహీనపరిచారు. కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా ఆర్టీసీని నష్టాల బాటలోకి నెట్టారు. కార్మికుల సమస్యలను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఇది మహిళల ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ఆర్టీసీకి కూడా కొత్త ఊపునిచ్చింది. మహాలక్ష్మి పథకం తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ గణనీయంగా పెరిగిందని అన్నారు.బస్ స్టేషన్లు, బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటివరకు 347.47 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి, రూ.12,171 కోట్లు ఆదా చేసుకున్నారు. మహిళలు ఆసుపత్రులకు, దేవాలయాలకు, బంధువుల ఇళ్లకు, పిల్లల చదువుల కోసం ప్రయాణించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోంది. గత శాసనసభ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాం. నియోజకవర్గాల వారీగా బస్సుల అవసరాలు, ప్రజల సమస్యలపై వినతులు తీసుకున్నాం. ప్రజల డిమాండ్కు అనుగుణంగా కొత్త సర్వీసులు, అదనపు ట్రిప్పులు ప్రారంభిస్తున్నాం. కరోనా సమయంలో రద్దైన సర్వీసులను కూడా అవసరమైన చోట



పునరుద్ధరిస్తున్నాం. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు, కండక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి కష్టాన్ని, సేవలను ఈ సభ అభినందించాలి. గతంలో ఆపరేషనల్ లాస్లతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఆర్టీసీ ఇప్పుడు నష్టాల నుంచి లాభాల దిశగా పయనిస్తోంది. సంస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని అన్నారు.పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేశాం. 15 సంవత్సరాలు దాటిన బస్సులను ఆర్టీసీలో కొనసాగించకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 340 డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులు గా రెట్రోఫిట్ చేశాం. హైదరాబాద్ నగరంలో ఖఓ ఇ-ఆతీతిలవ కింద 2,200 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తున్నాం. ఆర్టీసీ పరిధిలో నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో ఇప్పటికే క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రీమియం కేటగిరీ బస్సులతో పాటు ఎలక్ట్రిక్ బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆదిలాబాద్లో జిల్లా ఎస్పీ సహకారంతో ఆ జిల్లా బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాం. భవిష్యత్లో అవసరమైన అన్ని బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

# ఎండిపోతున్న పంటలు... రైతుల గగ్గోలు...

నిజామాబాద్,తెలంగాణలో వర్షాకాల సీజన్ కీలక దశకు చేరుకున్న సమయంలో వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఆశించిన స్థాయిలో పంటల సాగు జరగకపోగా.. ప్రస్తుతం పంటల ఎదుగుదలకు అత్యవసరమైన వర్షాలు లేకపోవడం సమస్యగా మారింది. రాష్ట్రంలో ఈ వర్షాకాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతంతో పోలిస్తే 22.5 శాతం లోటు నమోదైంది. ముఖ్యంగా 20 జిల్లాల్లోని 376 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు రైతాంగంపై ప్రభావం చూపుతున్నాయి.

నాలుగు నెలల వర్షాకాల సీజన్‌లో జూన్‌లో 11.74 శాతం, జూలైలో 1.36 శాతం, ఆగస్టులో 37.67 శాతం, సెప్టెంబరులో ఇప్పటివరకు ఏకంగా 77.76 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సాధారణంగా 626.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 485.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో 140.6 మిల్లీమీటర్ల లోటు ఏర్పడింది. జిల్లాల వారీగా పరిస్థితిని పరిశీలిస్తే హనుమకొండలో అత్యధికంగా 48.73 శాతం లోటు నమోదైంది. ఆ తర్వాత వరంగల్‌లో 47.58, జనగామలో 44.14, జోగులాంబ గద్వాలలో 42.44, భద్రాద్రి కొత్తగూడెంలో 37.93 శాతం లోటు ఉంది. ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మహబూబాబాద్, ఖమ్మం, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లోనూ వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి.రాష్ట్రంలోని 621 మండలాల్లో 15 మండలాల్లో అత్యధిక లోటు, 361 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 213 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండగా.. 32 మండలాల్లో అధిక వర్షపాతం



నమోదైంది. వర్షాభావం ప్రభావం ప్రధానంగా వరి సాగుపై పడింది. రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ పంటల సాధారణ విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 1,22,70,185 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. అంటే 92.69 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తయింది. గత ఏడాది ఇదే సమయానికి 1,28,76,525 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.ప్రధాన పంట వరి పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. సాధారణంగా 65,95,645 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 53,88,969 ఎకరాల్లో మాత్రమే సాగైంది. అంటే 81.7 శాతం విస్తీర్ణానికే పరిమితమైంది. గత ఏడాది ఇదే సమయానికి 63,66,253 ఎకరాల్లో వరి సాగైంది. కీలక సాగు సమయం దాటిపోవడంతో ఇక వరి విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వరి పంట ఎదుగుతున్న దశలో ఉండటంతో వర్షాలు లేక పొలాల్లో నీటి కొరత ఏర్పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో నాట్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మరోవైపు పత్తి, ఇతర పంటలు కాత, పూత దశకు చేరుకున్నాయి. ఈ దశలో తగినంత తేమ అందకపోతే దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది.

# ఉద్యమాల గడ్డ నుంచే తొలి పోరు



వరంగల్:తెలంగాణ రాజకీయ యవనికపై సరికొత్త అధ్యాయానికి తెరలేపిన కల్వకుంట్ల కవిత, తన కొత్త రాజకీయ వేదిక తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) తొలి సమరానికి చారిత్రక నగరం వరంగల్‌ను ఎంచుకున్నారు. ఉద్యమాలకు, రాజకీయ చైతన్యానికి మారుపేరైన ఓరుగల్లు గడ్డ నుంచే తన పార్టీ ఎన్నికల ప్రస్థానం మొదలుకానుందని హనుమకొండ వేదికగా కవిత ప్రకటించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలోనూ తమ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని వెల్లడించారు. సరికొత్త పేరు, పాత సెంటిమెంట్‌ల కలబోతతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ మనుగడను, భవిష్యత్ రాజకీయ బలాన్ని నిర్ణయించే కీలక అగ్నిపరీక్షగా మారనున్నాయి.కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని అస్త్రంగా చేసుకుని కవిత రంగంలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.13వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలనే డిమాండ్‌తో ఆమె నిరసన బాట పట్టారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన కవిత, అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు.రాజకీయాల్లో కొత్తగా ఆవిర్భవించిన ఏ పార్టీకైనా క్షేత్రస్థాయి క్యాడర్ బలం, ఓటు బ్యాంక్ నిర్మాణమే అతిపెద్ద సవాలు. కవిత తెలంగాణ రక్షణ సేనను ప్రకటించిన నాటినుంచీ ఆమె రాజకీయ ప్రభావం ఎంతవరకు ఉంటుందనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా ఈ తరుణంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని డివిజన్లలో పోటీ చేయాలనే నిర్ణయం ఆ పార్టీకి ఒక కత్తిమీద సాము వంటిది.వరంగల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే పటిష్టమైన క్యాడర్‌తో ఉన్నాయి. అలాంటి త్రిముఖ పోటీ వాతావరణంలో టీఆర్ఎస్ తనకంటూ సొంత ఓటు శాతాన్ని రాబట్టుకోగలదా లేదా అన్నది ఈ ఎన్నికల్లోనే తేలిపోనుంది. అన్ని డివిజన్లలో అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నిర్మించుకోవడమే కవిత వ్యూహంగా కనిపిస్తోంది. అయితే, బలమైన అసంతృప్త నేతలను తమ వైపు తిప్పుకోవడంలో పార్టీ ఎంతవరకు సఫలీకృతమవుతుందనేది కీలకం. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిలించి, ప్రజా సమస్యల ద్వారా పాలకులపై పోరాడటం ద్వారా తృతీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని కవిత ఆశిస్తున్నారు.రాష్ట్ర రాజకీయాల్లో తాము నామమాత్రపు పాత్రధారులం కాదని, ప్రత్యర్థులకు గట్టి సవాలు విసరగల పూర్తిస్థాయి ప్రత్యామ్నాయ శక్తినని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు కవితపై ఉంది. వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు కవిత కొత్త ప్రస్థానానికి నైతిక స్థైర్యాన్ని ఇస్తాయా, లేక ఎదురీతను తప్పించవా అనేది త్వరలోనే తేలనుంది. ఈ ఎన్నికల వేదికపై తెలంగాణ రక్షణ సేన ప్రదర్శించే ప్రభావమే ఆ పార్టీ భవిష్యత్ రాజకీయ మనుగడను దిశానిర్దేశం చేయనుంది.

# ఎవరికి వారే యమునా తీరే...బీజేపీ ఎమ్మెల్యేలు రూటే

హైదరాబాద్ :తెలంగాణలో అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని చెప్పుకునే భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో అంతర్గత కుమ్ములాటలు, సమన్వయ లోపం తీవ్రంగా వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదగడానికి రాజకీయంగా ఎంతో సానుకూల వాతావరణం, ప్రజల్లో ఆదరణ కనిపిస్తున్నప్పటికీ.. పార్టీలోని నేతల వైఖరి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటోంది. ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకోవడం, అంతర్గతంగా గోతులు తవ్వుకోవడం వంటి పరిణామాలు పార్టీ ఎదుగుదలకు ప్రధాన అవరోధంగా మారుతున్నాయి. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి ఈ వాదనలకు మరింత బలాన్ని చేకూర్చింది.అసెంబ్లీలో ప్రభుత్వంపై సమష్టిగా పోరాడి, ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన బీజేపీ ఎమ్మెల్యేలు ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరించడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంలో ఉమ్మడి వ్యూహం పూర్తిగా కొరవడింది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తున్న తరుణంలో, కొందరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లలో పాల్గొనడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. మరికొందరు సభ్యులు సభ సాక్షిగానే మంత్రులపై బహిరంగంగా పొగడ్తల వర్షం కురిపించడం సొంత పార్టీ శ్రేణులకే విస్మయం కలిగించింది.ముఖ్యంగా విధానపరమైన నిర్ణయాలపై కూడా బీజేపీ ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కనిపించలేదు. కీలకమైన డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో ఒక ఎమ్మెల్యే వ్యతిరేక గళం వినిపిస్తే, మరో ఎమ్మెల్యే అదే వేదికపై స్వాగతిస్తూ మాట్లాడటం తీవ్ర సమన్వయ లోపాన్ని బహిర్గతం చేసింది. ప్రజా సమస్యలపై పోరాటాల్లోనూ ఇదే ఒంటెద్దు పోకడ కనిపించింది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పంటల బీమా పథకం అమలు కోరుతూ అసెంబ్లీకి వినూత్నంగా ట్రాక్టర్‌పై ర్యాలీగా రాగా, ఆ నిరసనలో తోటి ఎమ్మెల్యేలెవరూ పాలుపంచుకోకపోవడం పార్టీలోని విభేదాలను స్పష్టం చేసింది.సమావేశాల ప్రారంభం నుంచి ప్రభుత్వం బీజేపీ పట్ల వ్యవహరించిన తీరుపై పార్టీ నాయకత్వంలో అసంతృప్తి వ్యక్తమైంది. మొదటి మూడు రోజుల పాటు బీజేపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించడం, ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోగా ఎదురుదాడి జరగడంతో ఆఖరి రోజు సభను బహిష్కరించాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ఈ నిర్ణయంపై ఎమ్మెల్యేలంతా ఏకతాటిపైకి రాలేకపోయారు. పార్టీ వ్యూహాన్ని లెక్కచేయకుండా నాలుగో రోజు కొందరు ఎమ్మెల్యేలు యథావిధిగా సభకు హాజరయ్యారు. ఒక ప్రజాస్వామ్య వేదికపై పార్టీగా నిలబడాల్సిన కీలక సమయంలో ఇలాంటి క్రమశిక్షణా రాహిత్యం బహిర్గతం కావడం రాజకీయంగా బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది.తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు దీటైన ప్రతిపక్షంగా అవతరించేందుకు బీజేపీకి విస్తృతమైన అవకాశాలున్నాయి. అయితే, సమర్థవంతమైన నాయకత్వ నిర్మాణం లేకపోవడం, ఉన్న నేతలు కలిసికట్టుగా అడుగులు వేయకపోవడం పార్టీకి శాపంగా మారుతోంది. అసెంబ్లీ వేదికగా ప్రజల పక్షాన నిలబడాల్సిన వేళ.. తమ స్వప్రయోజనాలు, భిన్నాభిప్రాయాలకే ప్రాధాన్యం ఇస్తున్న తీరు క్షేత్రస్థాయి కార్యకర్తలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. అసెంబ్లీ సాక్షిగా బట్టబయలైన ఈ అంతర్గత విభేదాలు, వ్యక్తిగత ఎజెండాలు ఇలాగే కొనసాగితే.. ప్రజల్లో పార్టీపై విశ్వసనీయత సన్నగిల్లే ప్రమాదం ఉందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

# ఫ్యూచర్ సిటీకి సిక్స్ లైన్స్ రోడ్

హైదరాబాద్:భారత్ ఫ్యూచర్ సిటీకి కీలకమైన రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఓఆర్ఆర్ రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రహదారిని నిర్మిస్తున్నారు. రెండు విడతల్లో చేపడుతున్న ప్రాజెక్టుకు మొత్తం రూ.4,621 కోట్ల వ్యయం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరో నాలుగు లైన్ల విస్తరణకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. మెట్రో లేదా రైల్వే కారిడార్ కోసం 20 మీటర్ల స్థలాన్ని రిజర్వు చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఫ్యూచర్ సిటీకి రవాణా, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీకి రాజమార్గం రెడీ అవుతోంది. రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రేడియల్ రోడ్డు-1లో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మార్గమధ్యంలో ఉన్న చిన్నచిన్న కొండలను తొలగిస్తూ రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిపనులు చేపడుతున్నారు. అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల పొడవున ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తున్నారు. ఆరు లైన్ల యాక్సెస్ కంట్రోల్ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 100 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ మార్గం భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతోంది.ప్రస్తుతం ఆరు లైన్ల రహదారిని నిర్మించనుండగా.. భవిష్యత్తులో మరో నాలుగు లైన్లను విస్తరించేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించారు.



ఇందుకు అనుగుణంగా అవసరమైన భూసేకరణ చేపడుతున్నారు. ఈ రహదారి పూర్తయితే ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య అనుసంధానం బలోపేతం కావడంతో పాటు ఫ్యూచర్ సిటీకి వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయి.ప్రాజెక్టును రెండు విడతల్లో చేపడుతున్నారు. తొలివిడతలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మిస్తున్నారు. కొంగర్‌ఖుర్ద్, ఫెరోజ్‌గూడ, కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. తొలి విడత నిర్మాణానికి రూ.1,911 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రెండో విడతలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్లు వరకు 22.3 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించనున్నారు. కుర్మిద్ద, కడ్తాల్, ఆకుతోటపల్లి, ఆమన్‌గల్లు ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. రెండో విడత కోసం రూ.2,710 కోట్ల వ్యయం చేయనున్నారు. రెండు విడతల పనులను రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్అండ్‌టీ సంస్థలు చేపడుతున్నాయి.రహదారి మధ్యలో భవిష్యత్తులో మెట్రో లేదా రైల్వే కారిడార్ ఏర్పాటు చేసేందుకు 20 మీటర్ల స్థలాన్ని ప్రత్యేకంగా రిజర్వు చేయడం ప్రాజెక్టులో మరో కీలక అంశం. దీంతో భవిష్యత్‌లో ప్రజా రవాణా వ్యవస్థను ఈ కారిడార్‌తో అనుసంధానించేందుకు అవకాశం ఉంటుంది.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**రూ.5 లక్షల ఉచిత సాయం దేశంలో ఎక్కడా లేదు.. తెలంగాణలోనే అమలు.**

**రెండో విడతలో 59 వేల గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు..**

**ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు.**

**ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టీకరణ..**

హైదరాబాద్: పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30?40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150?200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు.డ్రాలో పారదర్శకత.. అనర్హులకు చోటు లేదుఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు.రూ.5 లక్షలు ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ



ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. 8 లక్షల ఇళ్లకు సుమారు రూ.40 వేల కోట్ల భారంమొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చిన్న లోపాలతో ఆగిన 3,200 ఇళ్లకు పరిష్కారంమొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# కాంగ్రెస్ లో రేవంత్ కు ఫుల్ పవర్స్...

హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో బహిరంగంగా విమర్శలు చేసుకోవడం, మీడియా ముందుకు వచ్చి సొంత పార్టీ నేతలపై లేదా ప్రభుత్వంపై అసంతృప్తి వెళ్లగక్కడం కాంగ్రెస్‌లో చాలా కాలంగా నడుస్తున్న సంస్కృతి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు టీపీసీసీ డిసిప్లినరీ యాక్షన్ కమిటీ చర్యలకు శ్రీకారం చుట్టింది. నాగార్జునసాగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ, కమిటీ ఛైర్మన్ మల్లు రవి నేతృత్వంలో వరుసగా నోటీసులు ఇస్తూ అసంతృప్తులకు చెక్ పెడుతున్నారు. ఇటీవలే ఒకే రోజు ఏకంగా తొమ్మిది మంది కీలక నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం గాంధీ భవ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇందులో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి ఘటనకు సంబంధించి ఐదుగురు స్థానిక నేతలకు నోటీసులు ఇవ్వగా.. గజ్వేల్‌లో ఘర్షణలలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డిలకు నోటీసులు వెళ్లాయి. ఆదిలాబాద్ వివాదంలో కంది శ్రీనివాస్ రెడ్డి, సంజీవ్ రెడ్డిల వివరణ కోరారు. ఎంతటి సీనియర్ నేతలైనా సరే, బహిరంగ వివాదాలకు దిగితే సహించేది లేదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారుఈ కఠిన వైఖరి వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వానికి ఢిల్లీ అధిష్టానం పూర్తి స్థాయిలో స్వేచ్ఛను ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా కేబినెట్ విస్తరణ అంచనాల వేళ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్లు ఘాటు వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఆ తర్వాత సీఎం సమావేశాల్లో పాల్గొని లైన్‌లోకి రావడం ద్వారా ఒక స్పష్టమైన సంకేతం వెళ్లింది. తిరుగుబాటు స్వరాలు వినిపిస్తే



మంత్రి పదవులే కాదు, పార్టీలో ఉనికికే ప్రమాదమనే విషయాన్ని ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం ద్వారా అధిష్టానం ప్రాక్టికల్‌గా రుజువు చేసింది. ఇకపై ఎవరూ నోరెత్తకుండా రేవంత్ రెడ్డి చెప్పినట్లే వింటారా? అనే కోణంలో చూస్తే.. ఇది కేవలం రేవంత్ రెడ్డి ఏకపక్ష నిర్ణయం మాత్రమే కాదు. అధిష్టానం ప్రతినిధి మీనాక్షి నటరాజన్ మార్గదర్శకంలోనే మల్లు రవి ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ క్రమశిక్షణను కాపాడే బాధ్యతను రేవంత్ రెడ్డి–పీసీసీలకే అప్పగించడంతో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ పార్టీ గీత దాటితే చర్యలు ఖాయమని అర్థమైపోయింది. కాంగ్రెస్ లాంటి కల్చర్ ఉన్న పార్టీలో అసమ్మతిని నూటికి నూరు శాతం అణచివేయడం సులభం కాకపోయినా, ఈ కఠిన నిర్ణయాల వల్ల తాత్కాలికంగానైనా నేతలు సైలెంట్ అయ్యే అవకాశం ఉంది. రాబోయే స్థానిక పోరులో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి టీమ్ ముందుకు సాగుతున్న తరుణంలో, ఈ క్రమశిక్షణా అస్త్రం పార్టీ శ్రేణుల్లో ఐక్యతను తీసుకొస్తుందో లేదో వేచి చూడాలి.

# రామప్పను కబళిస్తున్న మైనింగ్



వరంగల్, ములుగు జిల్లాలో ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టుపై స్థానికులు, పర్యావరణవేత్తలు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రఖ్యాతి గాంచిన రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై మైనింగ్ ప్రభావం చూపే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ అభ్యంతరాల నేపథ్యంలో ములుగు జిల్లా కలెక్టర్ ప్రతిపాదిత ప్రాజెక్టు జియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేశారు. శాస్త్రీయ, పర్యావరణ అధ్యయనాల అనంతరం నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన తెలంగాణలోని చారిత్రక రామప్ప ఆలయానికి సమీపంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో చేపట్టాలని ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు, పర్యావరణవేత్తలు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి స్థానికులు, పాలంపేట స్పెషల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎస్‌డీఏ) కమిటీ సభ్యులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ (కేహెచ్‌టీ) ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ములుగు జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు భోర్కడే మంగళవారం ప్రతిపాదిత మైనింగ్ ప్రాజెక్టు జియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మైనింగ్ ప్రాజెక్టుపై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ హేమంత్.. శాస్త్రీయ, పర్యావరణపరమైన అంచనాలు పూర్తి అయిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ అంశంపై నిర్వహించిన సమావేశాల్లో జిల్లా యంత్రాంగంతో పాటు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, పీఎస్‌డీఏ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయం , చెరువు, పరిసర

గ్రామాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారసత్వ పరిరక్షణ వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌ను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్, మాజీ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు వ్యతిరేకించారు. గనుల తవ్వకాల కోసం బ్లాస్టింగ్, డ్రిల్లింగ్, భారీ యంత్రాల వినియోగం చేపడితే రామప్ప చెరువు నిర్మాణంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రామప్ప చెరువుకు సుమారు 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని.. దాని నిర్మాణానికి ఏదైనా నష్టం జరిగితే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని పాండురంగారావు పేర్కొన్నారు. చెరువుకు సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టడం కూడా పలు ప్రమాదాలకు దారితీయవచ్చని.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని కోరారు.ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు 40.4 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసేందుకు సింగరేణి గతంలో అనుమతులు పొందినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం 19 ఏళ్ల మైనింగ్ లీజు కూడా పొందినట్లు సమాచారం. ప్రాజెక్టు పరిధిలోని కొంత భూమిని సంస్థ ఇప్పటికే సేకరించి.. భూయజమానులకు పరిహారం చెల్లించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ప్రాజెక్టులో సుమారు 314 హెక్టార్ల అటవీ భూమి.. మరో 1,448 హెక్టార్ల వ్యవసాయ, ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉన్నట్లు పేర్కొంటున్నారు. దీంతో మైనింగ్ వల్ల పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిపై కూడా ప్రభావం ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు 2021 జూలైకి ముందే సమర్పించగా.. అదే ఏడాది డిసెంబర్‌లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలనే ప్రణాళిక ఉన్నట్లు సమాచారం. కానీ.. 2021 జూలై 25వ తేదీన రామప్ప ఆలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా లభించింది. దీంతో పాలంపేట, పరిసర గ్రామాల ప్రజలు ఆలయ పరిరక్షణ కోసం సేవ్ రామప్ప ఉద్యమాన్ని ప్రారంభించారు. స్థానికులు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో సింగరేణి ఈ ప్రాజెక్టును అప్పట్లో నిలిపివేసినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టును తిరిగి ముందుకు తీసుకెళ్లే అంశంపై చర్చలు మొదలవడంతో పాలంపేట, పరిసర గ్రామాల ప్రజలు మరోసారి ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రామప్ప ఆలయం, చెరువు, అటవీ ప్రాంతం, స్థానిక పర్యావరణ వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.



# మూడు హ్యామ్ రోడ్డు పనులకు శ్రీకారం

మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మూడు హ్యామ్ రోడ్డు పనులకు మంత్రులు సీతక్క, జూపల్లి శంకుస్థాపన చేశారు. పెద్దకొత్తపల్లి, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లో మొత్తం 19.35 కిలోమీటర్ల మేర రహదారులను రూ.15.87 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. పెద్దకొత్తపల్లి మండలంలో 6.95 కిలోమీటర్లు, పాన్‌గల్‌లో 4.40 కిలోమీటర్లు, వీపనగండ్లలో 8 కిలోమీటర్ల రహదారులు నిర్మించనున్నారు. ఈ రహదారులతో గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. పెద్దకొత్తపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో రూ.15.87 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు హ్యామ్ రోడ్డు పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. శనివారం నక్కలపల్లి స్టేజ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.మూడు రహదారి పనుల ద్వారా మొత్తం 19.35 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, మండల కేంద్రాలు, ప్రధాన రహదారులతో గ్రామాలకు అనుసంధానం పెంచడం, ప్రజల ప్రయాణ సమయాన్ని తగ్గించడం వంటి లక్ష్యాలతో ఈ పనులను చేపడుతున్నారు. హ్యామ్ విధానంలో చేపట్టే ఈ రహదారి పనులు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. పెద్దకొత్తపల్లి మండలం బండారపాకుల వద్ద



పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జెడ్పీ రోడ్డు వరకు నక్కలపల్లి, వెంకటచెర్ల మీదుగా 6.95 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించనున్నారు. ఈ పనులకు సుమారు రూ.5.70 కోట్లు కేటాయించారు. ఈ రహదారి ద్వారా మండలంలోని పలు గ్రామాలకు మెరుగైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయి.పాన్‌గల్ మండలంలో బండపల్లి మీదుగా పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జమ్మాపూర్ వరకు 4.40 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి సుమారు రూ.3.61 కోట్లు మంజూరు చేశారు. ఈ రహదారి పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రధాన రహదారులకు రాకపోకలు సులభతరం కానున్నాయి. వీపనగండ్ల మండలంలో కొర్లకుంట ఎక్స్ రోడ్డు నుంచి తూముకుంట?బొల్లారం ఎక్స్ రోడ్డు వరకు 8 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించనున్నారు. ఈ పనులకు రూ.6.56 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మూడు రోడ్లకు కలిపి రూ.15.87 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారులు అందుబాటులోకి రావడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్య, వైద్యం, ఉపాధి అవసరాల కోసం ప్రజల ప్రయాణాలు సులభతరం కానున్నాయి.

# మళ్లీ భగ్గుమంటున్న క్రూడాయిల్



న్యూఢిల్లీ, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలు 100 డాలర్లను దాటింది. దీంతో స్టాక్ మార్కెట్లతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. అమెరికా–ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మళ్లీ చుక్కలను తాకుతున్నాయి. సౌదీ అరేబియా ఇంధన ఉత్పాదక కేంద్రాలపై హౌతీ మిలిటెంట్లు డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయడంతో పశ్చిమాసియాలో టెన్షన్ వాతావరణం మరింత పెరిగింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు రేటు మరోసారి 100 డాలర్లను సమీపించింది. దీంతో మిడిల్ ఈస్ట్‌లో అశాంతి పెరిగితే క్రూడాయిల్ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. దేశ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో రష్యాతోపాటు మిడిల్ ఈస్ట్ దేశాల వాటానే ఎక్కువ. అయితే యుద్ధంతో యూఏఈ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితర గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు ముడి చమురు, గ్యాస్ రాక ఇబ్బందికరంగా మారింది. పెట్రో ఉత్పత్తుల రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధిలో నౌకల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నౌకలపై దాడులు జరిగితే బ్యారెల్ విలువ 120 డాలర్లను తాకే అవకాశం ఉంది. అమెరికాకు మద్దతిస్తున్నాయని గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులకు దిగుతోంది. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్‌లో పెట్రో ధరల పెంపునకు దారితీస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ ఒత్తిడికి లోనవుతోంది. చమురు దిగుమతుల చెల్లింపుల భారం, ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విజృంభణ, రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు, స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు, రూపాయి మారకం విలువ క్షీణత, చమురు ఆధారిత ఉత్పత్తుల తయారీ ఖరీదెక్కడం, ఎగుమతుల పతనం వంటివి దేశ ఎకానమీని రిస్క్‌లో పడేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభం కాగా, అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశంలో లీటర్ పెట్రోల్ రేటు రూ. 7.35, డీజిల్ ధర రూ. 7.53 పెరిగింది. అమెరికాతో ఇరాన్ చర్చల కారణంగా అప్పట్లో కొంతమేర శాంతియుత పరిస్థితులు మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్నాయి. ఇది మార్కెట్‌లో క్రూడ్ ధరల తగ్గుముఖానికి కలిసొచ్చింది. అయితే మళ్లీ దాడులు మొదలవడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఇక ఈ ఏడాది ఏప్రిల్–జూలైలో భారత ముడి చమురు దిగుమతుల విలువ 56 శాతం పెరిగి 63.4 బిలియన్ డాలర్లకు చేరింది. నిరుడు ఇదే సమయంలో 40.5 బిలియన్ డాలర్లేనని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# రూపాయి భారం లేకుండా ఉద్యోగులకు...

# కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా

**రాష్ట్రంలో 12.91 లక్షల మందికి లబ్ధి..**

**జీవో 77 ద్వారా అమలు..**

**ఇప్పటికీ 89 మంది ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా అందించాం..**

**శాసనమండలిలో  ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క..**

**రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్..**

హైదరాబాద్;సిబ్బంది సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమగ్రంగా సమాధానమిచ్చారు. ఖజానాపై గానీ, ఉద్యోగుల వేతనాలపై గానీ ఒక్క రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా రూ. కోటి దాకా ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు.  ??ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా:??"ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తున్నందున, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార పురోగతికి అనుగుణంగా ఇన్స్యూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77 ను జారీ చేసిందని వివరించారు.  ???89 క్లెయిమ్‌ల పరిష్కారం??ఈ పథకం ద్వారా ఇప్పటికే 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా



పరిహారాన్ని అందించినట్లు తెలిపారు. ఇందులో ?సింగరేణిలో 50, ?విద్యుత్ శాఖ (ాఖఆఅఒ, ఔఖఆఅఒ, ుఉఉఇఔఊ) ఉద్యోగులు 15, ?వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 మంది ఉన్నారు. ???రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు ఎయిర్ యాక్సిడెంట్ కవరేజ్??బ్యాంకులు అందించే శాలరీ మరియు పెన్షన్ అకౌంట్ ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం వంటి సందర్భాల్లో ఉచిత బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా విమాన ప్రమాదంలో

మరణిస్తే రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు కవరేజ్ లభిస్తుందని, సాధారణ ప్రమాద మరణానికి కూడా కొన్ని కేటగిరీల్లో రూ. 1.50 కోట్ల కంటే ఎక్కువ బీమా అందుతుందని స్పష్టం చేశారు. ???12.91 లక్షల మందికి ప్రయోజనం?రాష్ట్రంలో మొత్తం 12,91,046 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వ్యవస్థకు ఈ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ప్రభుత్వ సిబ్బంది (3,58,138 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 29,900 మంది గ్రాంట్-ఇన్-ఎయిడ్, 4,328 మంది యూనివర్సిటీ సిబ్బంది, 8,716 మంది ఇతర సంస్థల సిబ్బంది, 1,17,211 మంది కార్పొరేషన్లు/ పిఎస్‌యూ ఉద్యోగులు) ఉన్నారు. అలాగే 5,00,158 మంది తాత్కాలిక సిబ్బంది (85,255 మంది కాంట్రాక్ట్ సిబ్బంది, 49,396 మంది గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లు, 1,32,798 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, 15,762 మంది డైలీ వేజెస్ సిబ్బంది, 2,16,947 మంది గౌరవవేతనం వర్కర్లు) మరియు 2,72,615 మంది పెన్షనర్లు (1,58,540 మంది సర్వీస్ పెన్షనర్లు, 1,10,976 మంది ఫ్యామిలీ పెన్షనర్లు కేటగిరీ-1, 1,846 మంది కేటగిరీ-2 పెన్షనర్లు, 1,253 మంది ప్రొవిజనల్ పెన్షనర్లు) కవర్ అవుతారని వివరించారు.?ఈ పథకాన్ని తొలుత ఫిబ్రవరి 2024లో సింగరేణి ఉద్యోగులకు, ఆ తర్వాత జూన్ 2024 నుంచి విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అందరికీ వర్తింపజేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖల అధిపతులకు, కార్యదర్శులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని సభకు వివరించారు.

# రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులపై బ్యాంక్ ఛార్జీలు ఉండవు

న్యూఢిల్లీ, యూపీఐ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. రూ. 2,000 వరకు జరిగే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలపై బ్యాంకులు ఎలాంటి ఛార్జీలు విధించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే రూ. 2,000 వరకు ఖీబీఖజీఎ డెబిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపులపైనా బ్యాంకులు ఛార్జీలు వసూలు చేయడానికి వీలు లేదని పేర్కొంది.కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఖజీఎఎవనిబి జీనిట ాావబిబిశ్రీవఎవనిబి ాాఎబబివఎబ ంఞబి కింద నిబంధనల్లో మార్పులు చేస్తూ ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు.రూ. 2,000 వరకు యూపీఐ రూపీ డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేసే వ్యక్తుల నుంచి బ్యాంకులు, సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష ఛార్జీలు వసూలు చేయకూడదని ప్రభుత్వం తెలిపింది. చెల్లింపు చేసే వ్యక్తితో పాటు చెల్లింపు స్వీకరించే వ్యక్తిపై కూడా ఇలాంటి ఛార్జీలు విధించకూడదని స్పష్టం చేసింది.ఈ లావాదేవీలను ప్రభుత్వం అధికారికంగా "ఎలక్ట్రానిక్ మోడ్ ఆఫ్ పేమెంట్"గా వర్గీకరించింది. చెల్లింపులపై ఛార్జీలు విధించే అవకాశం ఉందంటూ చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టత ఇచ్చింది. వినియోగదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేందుకు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని గత నెలలోనే ప్రభుత్వం వెల్లడించింది.ముఖ్యంగా లావాదేవీలు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. వ్యాపారులపై కూడా అన్ని యూపీఐ లావాదేవీలకు వర్తించే విధంగా ఎలాంటి విధించబోమని స్పష్టం చేసింది.భవిష్యత్తులో నిర్దిష్ట పరిమితికి మించిన కొన్ని యూపీఐవ్యాపార లావాదేవీలపై మాత్రమే ఎండీఆర్ విధించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ ఛార్జీలు డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లావాదేవీలపై ప్రస్తుతం వర్తించే పోలిస్తే గణనీయంగా తక్కువగా ఉంటాయని పేర్కొంది.దేశవ్యాప్తంగా రోజువారీ చెల్లింపులకు వినియోగం భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్రం తాజా స్పష్టత వినియోగదారులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. ముఖ్యంగా చిన్న మొత్తాల చెల్లింపుల్లో అదనపు ఛార్జీల భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేయడంతోయూపీఐ వినియోగం మరింత సులభంగా కొనసాగనుంది.

# టీపీసీసీ కొత్త ఇంచార్జీ ఎవరు...



Congress Leader Meenakshi Natarajan

హైదరాబాద్ :తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి సంస్థాగత మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్ త్వరలోనే ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఉన్నత చదువులకోసం విదేశాలకు వెళ్లాలని ఆమె నిర్ణయించుకోవడంతో, ఆమె స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగించేందుకు హైకమాండ్ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.కొంతకాలంగా ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో మీనాక్షి నటరాజన్ ఉన్నారు. ఇప్పటికే ఆమె విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకునేందుకు అప్లై చేసుకున్నట్టు సమాచారం. గతంలో కూడా ఆమె విదేశాల్లో చదువుకునేందుకు ప్రయత్నించారు. అయితే పార్టీ హైకమాండ్, రాహుల్ గాంధీ సూచనల మేరకు ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. అయితే, ఉన్నత చదువుల కోసం వచ్చిన సువర్ణావకాశాన్ని వదులుకోవడం ఇష్టం లేక ఆమె మరోసారి హైకమాండ్‌కు తన పరిస్థితిని వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె విదేశీ ప్రయాణానికి పార్టీ నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరో రెండు నెలల పాటు ఆమె ఇంచార్జ్‌గా కొనసాగే అవకాశం ఉంది. ఈ లోపు ఆమె స్థానంలో పూర్తి స్థాయి బాధ్యతలను మరొకరికి అప్పగించేందుకు హైకమాండ్ ఆలోచిస్తున్నట్టు కనిపిస్తోంది. మీనాక్షి నటరాజన్ స్థానంలో తెలంగాణ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే దానిపై ఏఐసీసీ స్థాయిలో కసరత్తు ప్రారంభమైంది. ఈ పోస్టు కోసం పార్టీ హైకమాండ్ కొంతమంది సీనియర్ల పేర్లను పరిశీలిస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాజకీయాలపై పట్టున్న నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ రేసులో తమిళనాడుకు చెందిన ఇద్దరు కీలక నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తమిళనాడుతో పాటు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు ఉన్న ఎంపీ ఒకరు ఈ రేసులో ముందున్నట్టు సమాచారం. అలాగే తమిళనాడుకు చెందిన మరో సీనియర్ నేత, మాజీ ఎంపీ చల్లకుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి.మరోవైపు పార్టీలో సుదీర్ఘ అనుభవమున్న సీనియర్ నాయకుడు ముకుల్ వాస్నిక్ పేరు కూడా ప్రచారంలో ఉంది. తెలంగాణ కాంగ్రెస్‌లోని పలువురు సీనియర్ నాయకులతో ముకుల్ వాస్నిక్‌కు దశాబ్దాలుగా మంచి సంబంధాలున్నాయి. రాష్ట్రంలో పార్టీ అంతర్గత సమీకరణాలను చక్కదిద్దడంలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# కొండా కు దారెటు

హైదరాబాద్ :తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత హాట్ టాపిక్‌గా మారిన పేరు కొండా సురేఖ. మంత్రివర్గం నుంచి అనూహ్య పరిణామాల నేపథ్యంలో బర్తరఫ్ అయిన తర్వాత ఆమె రాజకీయ భవిష్యత్తు ఎటు వైపు పయనిస్తుందనే దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని, పార్టీ మారే ప్రసక్తే లేదని ఆమె బహిరంగంగానే స్పష్టం చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మాత్రం ఇందుకు భిన్నమైన సంకేతాలను ఇస్తున్నాయి. పార్టీలో ఆమె పాత్ర, తీసుకుంటున్న నిర్ణయాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి.మంత్రి పదవిని కోల్పోయిన తర్వాత కొండా సురేఖ అసెంబ్లీ సమావేశాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. అంతేకాకుండా, అత్యంత కీలకమైన సీఎల్పీ సమావేశానికి కూడా ఆమె హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో అనేక అనుమానాలకు తావిచ్చింది. ఒక మంత్రిగా చక్రం తిప్పిన వ్యక్తి, అదే సభలో సాధారణ ఎమ్మెల్యేగా అడుగుపెట్టడం మానసికంగా కాస్త ఇబ్బందికరంగా ఉండడం సహజం. కానీ, ఇది కేవలం వ్యక్తిగత ఇబ్బంది మాత్రమే కాదని, పార్టీ నాయకత్వం అవలంబిస్తున్న వైఖరిపై, తనను బర్తరఫ్ చేసిన తీరుపై ఆమె నిరసన గళం వినిపిస్తున్నారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. పార్టీ తీరుపై అలిగినందుకే ఆమె సభకు, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే వాదన బలపడుతోంది.మరోవైపు, మాజీ ఓఎస్డీకి సంబంధించిన వ్యవహారం కొండా సురేఖను మరింత ఇబ్బందికర పరిస్థితులలోకి నెట్టింది. ఈ అంశానికి సంబంధించి పోలీసులు తనను, తన అనుచరులను అనవసరంగా వేధిస్తున్నారంటూ ఆమె తీవ్ర ఆవేదన చెందుతున్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఉంటూనే ఇలాంటి పోలీసు వేధింపులను ఎదుర్కోవాల్సి రావడం, సొంత పార్టీ నుంచి తగిన రక్షణ లేకపోవడం ఆమెను తీవ్ర మనస్తాపానికి గురిచేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు ఆమెను పార్టీ అధిష్టానానికి దూరం చేస్తున్నాయా లేక మరింత ఒంటరి చేస్తున్నాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.ఈ వివాదాల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ స్వయంగా కొండా సురేఖకు ఫోన్ చేశారని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారంటూ పెద్ద ఎత్తున వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనని, సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం మాత్రమేనని పార్టీ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. అధిష్టానం నుంచి ఎలాంటి అధికారిక జోక్యం లేకపోవడం లేదా ఈ అంశంపై హైకమాండ్ మౌనం వహించడం వెనుక వ్యూహం ఏమిటనేది అంతుచిక్కడం లేదు.ఒకవైపు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని చెబుతూనే, మరోవైపు కీలక సమావేశాలకు, అసెంబ్లీకి పూర్తిగా దూరంగా ఉండడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. సురేఖ అనుసరిస్తున్న ఈ వ్యూహం భవిష్యత్తులో ఎలాంటి సంచలన నిర్ణయాలకు దారితీస్తుందోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మంత్రి పదవి కోల్పోయిన బాధ, మాజీ ఓఎస్డీ వ్యవహారంలో ఎదురవుతున్న ఒత్తిళ్లు, పార్టీ అంతర్గత సర్దుబాట్ల మధ్య కొండా సురేఖ భవిష్యత్తు ఎలా ఉంటుందనేది అత్యంత ఆసక్తిగా మారింది.



# కవులు, కళాకారుల పుట్టిల్లు కరీంనగం.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ :దేశంలో ఎక్కడా లేనంత మంది కవులు, కళాకారులు కరీంనగర్ సొంతంమధుపాలీస్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ బుక్ అద్భుతంవిద్యా సంస్థలకు, యువతకు ఎంతో ఉపయోగపడే పుస్తకం. మోదీజీ చరిత్రను పుస్తక రూపంలో తెలుగు వారికి అందించండి. కవులు, కళాకారుల పుట్టిల్లు కరీంనగర్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాను దేశమంతా పర్యటిస్తున్నానని, అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాని చెప్పిన బండి సంజయ్ కరీంనగర్ లో ఉన్నంత మంది కవులు, కళాకారులు మరే జిల్లాలోనూ లేరని చెప్పారు. సమాజానికి ఎంతో సేవ చేస్తున్న కవులు, కళాకారులు పుట్టిల్లు కరీంనగర్ నుండి తాను ఎంపీగా, మంత్రిగా కొనసాగడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈరోజు కరీంనగర్ లోని మంకమ్మ తోట సాయి మానేరు స్కూల్ లో కవి, రచయిత, ఎస్సారార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, లయన్ కెప్టెన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలపై రాసిన ఆర్టికల్స్ తో రూపొందించిన పుస్తకాన్ని మధుపాలీస్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ పేరుతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, మానేరు స్కూల్స్ అధినేత అనంత రెడ్డి, టీబీఎస్ఎస్ అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఏమన్నారంటే..నేను దేశమంతా తిరుగుతున్నాను. అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. కానీ దేశంలో ఎక్కడా లేనంత



మంది కళాకారులు కరీంనగర్ లో వున్నారు. వీరంతా సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారు. అందులో డాక్టర్ మధుసూదన్ రెడ్డి ఒకరు. ఇక్కడ నేను ఎంపీగా, మంత్రిగా ఉండటం నా అదృష్టం.మధుపాలీస్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ పేరుతో లయన్ కెప్టెన్, ఎస్సారార్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి రాసిన ఆర్టికల్స్ ను ఈ విధంగా పుస్తక రూపంలో తీసుకురావడం, నా చేతుల మీదుగా ఆ పుస్తకాన్ని రిలీజ్ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే..ఈ 400 పేజీల పుస్తకం విద్యా సంస్థలకు, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతకు ఎంతో ఉపయోగపడుతుంది. కాలేజీ ప్రిన్సిపాల్ గా రిటైర్డ్ అయి విశ్రాంతి తీసుకోవాల్సిన మధుసూదన్ రెడ్డి అవిశ్రాంతంగా ఇలాంటి ఆర్టికల్స్ రాస్తూ సమాజానికి ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. రేపు ప్రధానమంత్రి మోదీ జన్మదినం. ఒకనాడు విదేశాలకు వెళతానంటే వీసా కూడా నిరాకరించిన దేశాలు సైతం నేడు మోదీ సేవలను చూసి రెడ్ కార్పెట్ తో స్వాగతం పలుకుతున్నాయి. ఆయన సాష్టాంగ పడుతున్నయి. మోదీ సేవను చూసి సగటు భారతీయుడు సైతం నేను ఇండియన్ అని గల్లా ఎగిరేసేలా పని చేస్తున్నారు.

# ఢిల్లీ గడ్డపై బ్రిక్స్ బిగ్ మీట్..!

## గ్లోబల్ సౌత్‌కు భారత్ సారథ్యం.. ప్రపంచానికి కొత్త దిశపై చర్చ




న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలు, సాంకేతిక మార్పులు కొనసాగుతున్న వేళ.. అందరి చూపు న్యూఢిల్లీ వైపు మళ్లింది. భారత్ ఆతిథ్యమిచ్చిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరిగింది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్.. స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరతకు ప్రాధాన్యం ఇస్తూ సదస్సును నిర్వహించింది. ప్రపంచ పాలన, ఆర్థిక సహకారం, సాంకేతికత, భద్రత, వాతావరణ మార్పులు, గ్లోబల్ సౌత్ దేశాల పాత్ర వంటి అంశాలపై బ్రిక్స్ సభ్య దేశాల నేతలు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలు అంతర్జాతీయ నిర్ణయ ప్రక్రియల్లో మరింత ప్రతిబింబించాలనే అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఐక్యరాజ్యసమితి సహా అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు చేపట్టి, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని బ్రిక్స్ దేశాలు పునరుద్ఘాటించాయి. ఆర్థిక రంగంలో సభ్య దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు పెంచడం, స్థానిక కరెన్సీల వినియోగాన్ని ప్రోత్సహించడం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చ జరిగింది. అయితే ఒకే బ్రిక్స్ కరెన్సీని తీసుకురావడంపై ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. బదులుగా స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, ఆర్థిక సహకారం వంటి ఆచరణాత్మక అంశాలపై దృష్టి పెట్టారు. భవిష్యత్ ప్రపంచాన్ని ప్రభావితం చేయనున్న కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధన, డిజిటల్ టెక్నాలజీ, శాస్త్ర పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచే అంశాలు కూడా చర్చకు వచ్చాయి. వాతావరణ మార్పులు, ఆహార భద్రత, సుస్థిర వ్యవసాయం, నీటి నిర్వహణ, పట్టణాభివృద్ధి వంటి అంశాలపైనా సభ్య దేశాలు దృష్టి సారించాయి. సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ద్వైపాక్షికంగా సమావేశమయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, భారత్–చైనా సంబంధాలు, వాణిజ్యం, సరఫరా గొలుసులు, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై చర్చించారు. బ్రిక్స్

వేదికపై సాక్షిగా జరిగిన ఈ భేటీ కూడా అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సదస్సు ముగింపులో న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆమోదించబడింది. బహుళపాక్షిక వ్యవస్థ బలోపేతం, గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం, ఆర్థిక సహకారం, సాంకేతిక భాగస్వామ్యం, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు. బ్రిక్స్ విస్తరిస్తున్న నేపథ్యంలో సభ్య దేశాల ప్రయోజనాలు, అభిప్రాయాలు భిన్నంగా ఉన్నప్పటికీ.. ఏకాభిప్రాయంతో ముందుకు సాగడం భవిష్యత్‌లో కీలకంగా మారనుంది. రెండు రోజుల పాటు న్యూఢిల్లీ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. సదస్సు ముగిసినా.. ప్రపంచ పాలన, ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, టెక్నాలజీ, గ్లోబల్ సౌత్ పాత్రపై బ్రిక్స్ చర్చ మాత్రం కొనసాగనుంది. మారుతున్న ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల స్వరం మరింత బలంగా వినిపించాలనే అంశాన్ని భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు మరోసారి ముందుకు తెచ్చింది.

# 1000 రోజుల పాలనపై నిరసన.. అసెంబ్లీ గేటు వద్ద రచ్చ..!

## బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యం!



శాసనసభ సమావేశాల వేళ అసెంబ్లీ ప్రాంగణం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడంపై గులాబీ శ్రేణులు భగ్గుమన్నాయి. పోలీసుల వ్యవహార శైలికి, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై జరిగిన భౌతిక దాడులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని బీఆర్ఎస్ అధిష్టానం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహం, అప్రజాస్వామిక వైఖరిపై బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దారుణంగా ప్రవర్తించారని అన్నారు. మంత్రిగా సేవలు అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత

దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. మేం సభలో లేని సమయంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరపడం సరికాదన్నారు. తాము చేసేది తప్పు కాదంటే, ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని భావిస్తే బీఆర్ఎస్ సభ్యులు సభకు వచ్చినప్పుడు చర్చ జరగపాలని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తామన్న భయంతో మేం లేని సమయం చూసి సభలో చర్చిస్తున్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కనుక మేం సభకు వచ్చినప్పుడు కీలకమైన నిషేధిత భూముల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు. పోలీసుల తోపులాటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి కిందపడిపోయారు. తమను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద హరీష్ రావు తన చొక్కా విప్పేశారు. నల్ల టీషర్టుతో లోపలికి అనుమతించకపోవడంతో హరీష్ రావు బనియన్‌తో నిరసన తెలుపగా, ఆయనతో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు. మరోవైపు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడంతో ఆమె కన్నీళ్లు పెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అని పోలీసుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా అసెంబ్లీ గేటు వద్ద పోలీసుల అక్రమ అరెస్టులు, ఘటనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది.





# హిజ్రాల దందాపై పోలీసులు దృష్టి



రంగారెడ్డి:శుభకార్యాలు, వేడుకలు జరిగే ప్రదేశాలకు హిజ్రాలు కచ్చితంగా ఎలా వస్తారు? ఎక్కడ ఏ చిన్న ఫంక్షన్ జరిగినా వారికి ముందుగా సమాచారం ఎలా అందుతుంది? ఈ ప్రశ్నలు చాలామంది మదిని తొలిచేవే. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశం సందర్భంగా హిజ్రాలు ప్రవర్తించిన తీరుపై తీవ్ర దుమారం రేగడంతో వారి సమాచార వ్యవస్థపై చర్చ మొదలైంది. దీని వెనుక ఓ పక్కా వ్యవస్థ, పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.ఇంతకీ వీరికి సమాచారం ఎలా అందుతుందంటే.. దీని వెనుక పక్కా కమీషన్ దందా నడుస్తోందని ఓ హిజ్రా స్వయంగా ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. పెళ్లిళ్లు, గృహప్రవేశాల వంటి శుభకార్యాల వివరాలను తమకు చేరవేసేందుకు ప్రత్యేకంగా కొందరు వ్యక్తులు పనిచేస్తారని ఆమె తెలిపారు. వారి ద్వారానే తమకు ఫంక్షన్ల లోకేషన్లు తెలుస్తాయని వివరించారు.సమాచారం ఇచ్చేది వీరే..

ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. శుభకార్యాలకు సంబంధించిన వ్యక్తులే హిజ్రాలకు ప్రధాన ఇన్ఫార్మర్లు.టెంట్ హౌస్ వాళ్లు: ఫంక్షన్‌కు టెంట్లు, కుర్చీలు సరఫరా చేసేవారు. పంతుళ్లు: పూజలు, శుభకార్యాలు జరిపించే పురోహితులు.గోమాతను తెచ్చేవారు: గృహప్రవేశాల వంటి వాటికి గోమాతను తీసుకువచ్చేవారు.సన్నాయి మేళం వాళు ఫంక్షన్లలో సంగీత కార్యక్రమాలు నిర్వహించేవారు.బిల్డర్లు, వాచ్‌మెన్లు: కొత్తగా నిర్మించిన ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో పనిచేసేవారు.ఈ వ్యక్తులు ఫలానా చోట ఫంక్షన్ జరుగుతోందని ముందుగానే తమకు ఫోన్ చేసి లోకేషన్ పంపిస్తారని సదరు హిజ్రా తెలిపారు.కేవలం సమాచారం ఇవ్వడమే కాదు, దీనికి వారు కమీషన్ కూడా తీసుకుంటారని ఆమె చెప్పడం గమనార్హం. గతంలో ఒక్కో లోకేషన్‌కు రూ.200 నుంచి రూ.500 ఇచ్చేవాళ్లమని, ఇప్పుడు డిమాండ్ పెరగడంతో రూ.2000 ఇవ్వనిదే ఎవరూ సమాచారం ఇవ్వడం లేదని ఆమె అన్నారు. ముఖ్యంగా గృహప్రవేశానికి గోమాతను తీసుకొచ్చేవారు రూ.3000 వరకు డిమాండ్ చేస్తారని, అంత ఇస్తేనే గానీ అడ్రస్ చెప్పరని వివరించారు. ఈ నెట్‌వర్క్‌లో ఎవరు ముందుగా సమాచారం ఇస్తే, వారికే కమీషన్ డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.చింతల్ ఘటనపై స్పందిస్తూ, కొందరు హిజ్రాలు మాత్రమే డబ్బుల కోసం దౌర్జన్యంగా ప్రవర్తిస్తారని, వారి వల్లే తమ వర్గం మొత్తానికీ చెడ్డపేరు వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా కడుపు నింపుకోవడానికే ఈ పని చేస్తామని, చాలామంది ఎంత ఇస్తే అంత తీసుకుని ఆశీర్వదించి వెళ్లిపోతారని చెప్పారు. కొందరు దాతలు తమను స్వయంగా ఇళ్లకు పిలిపించుకుని గౌరవిస్తారని గుర్తుచేశారు. ఏదేమైనా శుభకార్యాల వద్ద హిజ్రాల సందడి వెనుక ఇంత పెద్ద కమీషన్ నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# ప్రజా సమస్యలు కాదు... డ్రామాలతో సరి





హైదరాబాద్:తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు రెండు రోజుల పాటు సభ లోపల నడవాల్సిన ప్రజా సమస్యల చర్చ కంటే, బయట నడిచిన రాజకీయ హైవోల్టేజ్ డ్రామానే ఊహించని మలుపులు తిరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, నెరవేర్చని ఆరు గ్యారెంటీలు, హామీల వైఫల్యాలపై పక్కా చార్జ్‌షీట్ తో ప్రభుత్వాన్ని శాసనసభ వేదికగా ఎండగట్టాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహం రచించింది. కేటీఆర్, హరీశ్‌రావుల నాయకత్వంలో నల్ల చొక్కాలు ధరించి, ప్లకార్డులతో మీడియా మైలేజ్ సాధించడమే లక్ష్యంగా అసెంబ్లీ గేట్ వద్దకు చేరుకున్నారు. అయితే, ఆరంభంలోనే బీఆర్ఎస్ ఆశించిన పొలిటికల్ మైలేజ్ కాస్తా, కాంగ్రెస్ విసిరిన పక్కా పొలిటికల్ ట్రాప్‌లో పడి పూర్తిగా ఆవిరైపోయింది.అసెంబ్లీ గేటు వద్ద భద్రతా సిబ్బంది ఆంక్షలు విధించడంతో చోటుచేసుకున్న నెట్టివేతలు, తోపులాటల సమయం వరకు బీఆర్ఎస్ వ్యూహం బాగానే అమలైంది. కేటీఆర్, హరీశ్‌రావు సహా ప్రజాప్రతినిధుల అరెస్టులు, మహిళా నేతల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరుపై ప్రతిపక్షం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేసింది. కానీ, నిరసన ఆవేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు మైండ్ గేమ్‌ను ఒక్కసారిగా తిరగరాశాయి. పోలీసులతో వాగ్వాదంలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వ్యవస్థను ఉద్దేశించి ఆయన మాట్లాడారంటూ కాంగ్రెస్ శ్రేణులు వీడియో క్లిప్‌లతో తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగాయి. ఈ ఒక్క అవకాశాన్ని పట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు రాజకీయాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. సభ లోపల స్పీకర్ భోరున విలపించడం, కాంగ్రెస్ నేతలు దళిత ఆత్మగౌరవ సెంటిమెంట్‌ను రగల్చడంతో అసలు కథ పక్కదారి పట్టింది. ప్రభుత్వంపై రావలసిన 'వెయ్యి రోజుల వైఫల్యాల' చర్చ కాస్తా, బీఆర్ఎస్ చేసిన వ్యాఖ్యలు , స్పీకర్ అవమాన ఘటన చుట్టూ తిరిగేలా కాంగ్రెస్ నేతలు నరేటివ్‌ను సెట్ చేయగలిగారు. దీంతో ప్రభుత్వాన్ని కార్నర్ చేయాల్సిన

బీఆర్ఎస్, అనూహ్యంగా ఆత్మరక్షణలో పడి వివరణలు ఇచ్చుకునే పరిస్థితికి దిగజారింది.రెండో రోజు పరిణామాలు మరింత ఉద్రిక్తంగా మారాయి. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్ రెడ్డిలను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల కింద పోలీసులు మంగళవారం ఉదయాన్నే వారి నివాసాల వద్ద అరెస్ట్ చేయడం కాంగ్రెస్ మైండ్ గేమ్‌లో పరాకాష్టగా నిలిచింది. కేటీఆర్, హరీశ్‌రావులపై కూడా కేసులు నమోదు కావడం, శాసనమండలిలో ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ కాంగ్రెస్ పట్టుబట్టడంతో బీఆర్ఎస్ నాయకత్వం డిఫెన్స్‌లో పడిపోయింది. రెండు రోజుల అసెంబ్లీ ఘట్టాలను నిశితంగా పరిశీలిస్తే, ఆరంభంలో హంగామా చేసి మీడియా దృష్టిని ఆకర్షించిన బీఆర్ఎస్, చివరకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా విసిరిన 'సభా సంప్రదాయాలు – దళిత సెంటిమెంట్' అనే ఆత్మరక్షణ ట్రాప్‌లో దారుణంగా చిక్కుకుపోయింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాల్సిన కీలక సమయాన్ని బీఆర్ఎస్ తమ నేతల అరెస్టులు, క్షమాపణలు, వివరణలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రాజకీయాల్లో ప్రత్యర్థులను రెచ్చగొట్టి తప్పులు చేయించడమే అసలైన వ్యూహమైతే, ప్రస్తుత పోరులో అధికార కాంగ్రెస్ విసిరిన గేండ్‌లో బీఆర్ఎస్ దారుణంగా దొరికిపోయింది. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా కేటీఆర్ మీడియా ముందూ, పోలీసుల వద్ద వాడిన తీవ్రమైన, అకోపపూరిత భాష ప్రతిపక్షానికి రాజకీయంగా ఎలాంటి మైలేజ్‌ను అందించలేకపోయింది. ఎమ్మెల్సీ తాతా మధు చేసిన తొందరపాటు వ్యాఖ్యల వల్లే ఈ వివాదమంతా మొదలైందనే విషయాన్ని కేటీఆర్ పక్కనపెట్టి, అదే స్థాయి ఆక్రోశాన్ని ప్రదర్శించడంతో కథ కాంగ్రెస్‌కు అనుకూలంగా మారింది. చివరికి, షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సభా ప్రాంగణం బయట "కేసీఆర్ చావు కోరుకుంటున్నట్లు, ఎర్రవల్లి నివాసానికి చావు డప్పు కొడతామంటూ" చేసిన వికృత వ్యాఖ్యలను సైతం ప్రజాక్షేత్రంలో సెంటిమెంట్‌గా మార్చుకుని సానుభూతి సాధించడంలో బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైంది. కేటీఆర్ తీవ్రమైన భాషను పక్కనపెట్టి, ప్రజాస్వామ్యయుతమైన శైలితో నిలదీసి ఉంటే.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలపై ప్రజల సానుభూతి పూర్తిగా కేసీఆర్‌కే దక్కేది. కానీ, కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా రగిల్చిన ఆవేశపు ట్రాప్‌లో పడి బీఆర్ఎస్ రెచ్చిపోవడం వల్ల, ప్రత్యర్థి చేసిన పెద్ద తప్పు కూడా కప్పిపోయి.. చివరికి బీఆర్ఎస్‌కే రాజకీయంగా తీవ్ర నష్టం చేకూరింది.

నోరు తెచ్చిన తంటా

తెలంగాణ రాజకీయాల్లో తిట్లు, వ్యంగ్యాస్త్రాలు కొత్త కాదు. కానీ, ఒకప్పుడు ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన అదే భాష.. ఇప్పుడు బీఆర్ఎస్ మెడకే చుట్టుకుంటోందా? తెలంగాణ ఉద్యమ కాలంలో కేసీఆర్ వాడిన నాటు భాష, యాస ప్రజలను కదిలించి ఒక ఎమోషన్‌ను సృష్టించాయి. అధికారంలో ఉన్నన్నాళ్లూ మా భాషే ఇంత.. ఇది తెలంగాణ మట్టి వాసన అంటూ సమర్థించుకున్నారు. కానీ కాలం మారింది, పాత్రలు మారాయి. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న గులాబీ నేతలు వాడుతున్న ఆవేశపూరిత భాష, నియంత్రణ లేని మాటలు ఆ పార్టీకి శాపాలుగా మారుతున్నట్టు కనిపిస్తోంది.ఉద్యమంలో ఆవేశానికి ఆదరణ దక్కింది. కానీ అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలు బాధ్యతాయుతమైన ప్రవర్తనను ఆశిస్తారు. ఈ సున్నితమైన తేడాను బీఆర్ఎస్ విస్మరిస్తున్నట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను ఎండగట్టడానికి బీఆర్ఎస్ ఒక పక్కా చార్జ్‌షీట్‌తో సిద్ధమైంది. నల్ల చొక్కాలు ధరించి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలనుకుంది. కానీ ఆచరణలోకి వచ్చేసరికి అది కాస్తా నోటి దురుసు వల్ల దారితప్పింది.అసెంబ్లీ గేట్ వద్ద నిరసన సందర్భంగా ఉద్రిక్తత, పోలీసుల తోపులాటల వరకు ప్రజల్లో సానుభూతి బీఆర్ఎస్ వైపే ఉంది. కానీ.. ఆ ఆవేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, సభా స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలు మొత్తం సీన్ ను

మార్చేశాయి. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించారంటూ కాంగ్రెస్ దీనిని ఏకంగా దళిత ఆత్మగౌరవ సమస్యగా మార్చేసింది. సభలో స్పీకర్ భావోద్వేగానికి గురికావడం, ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయడంతో బీఆర్ఎస్ ఆత్మరక్షణలో పడింది. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై జరగాల్సిన చర్చ కాస్తా.. బీఆర్ఎస్ నేతల భాష, సభా మర్యాదల ఉల్లంఘన చుట్టూ తిరిగేలా అధికార పార్టీ పావులు కదిపింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం సంయమనం కోల్పోయారు. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా మీడియా, పోలీసుల సమక్షంలోనే ఆయన ఉపయోగించిన తీవ్రమైన పదజాలం విమర్శలకు తావిచ్చింది. అధికార పార్టీ ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టినప్పుడు, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా నిలబడాల్సింది పోయి.. అదే ఆవేశంతో ఎదురుదాడికి దిగడంతో కాంగ్రెస్ ట్రాప్ లో బీఆర్ఎస్ పడినట్లు కనిపిస్తోంది. షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సభా ప్రాంగణం బయట కేసీఆర్ చావు కోరుకుంటున్నామని, ఎర్రవల్లి నివాసానికి చావు డప్పు కొడతామని అత్యంత హేయమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి సానుభూతిగా మార్చుకోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. అప్పటికే బీఆర్ఎస్ నేతల తిట్లు, వివాదాస్పద వ్యాఖ్యలే మీడియాలో, సోషల్ మీడియాలో హెడ్‌లైన్స్‌గా మారడమే ఇందుకు కారణం. ప్రత్యర్థి చేసిన పెద్ద తప్పు కూడా, బీఆర్ఎస్ వాడిన భాష ముందు కొట్టుకుపోయింది. ప్రభుత్వ వైఫల్యాలు, రైతు సమస్యలు, గ్యారెంటీలను గట్టిగా నిలదీసి ప్రజల దృష్టిని ఆకర్షించాల్సిన సమయంలో.. తమ నేతల అరెస్టులు, బెయిళ్లు, కేసులపై వివరణలు ఇచ్చుకోవడానికే బీఆర్ఎస్ కు సమయం సరిపోతోంది. ఎదురుదాడి చేసే క్రమంలో సంస్కారం, హుందాతనం కోల్పోతే ప్రజల్లో సానుభూతి కాస్తా అసహ్యంగా మారుతుందన్న ప్రాథమిక సూత్రాన్ని ఆ పార్టీ విస్మరిస్తోంది.



# వేల ఎకరాల భూములపై సీఎం కన్ను..

## 22ఏ భూముల బాధితులతో కేటీఆర్




హైదరాబాద్:తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెట్టాపట్టాల్‌వేసుకుని రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. కొండల్, తొండల్, అనకొండల్ అంటూ రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు.తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు.రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో కూడిన మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఫైళ్లు ఎవరి ఆదేశాల మేరకు కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళు ్తన్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టడానికి గిరిజనుల పొలాలను గుంజుకున్నారని, హైదరాబాద్ చుట్టూ ఉన్న రూ. వేల కోట్ల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్ రెడ్డి కన్ను పడిందని విమర్శించారు. మూసీ

ముసుగులోనూ, ఫ్యూచర్ సిటీ పేరుతోనూ పెద్ద ఎత్తున రియల్ దందాకు తెరలేపారని దుయ్యబట్టారు.కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూభారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు.సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు.కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా మార్చలేరని, కానీ ఇప్పుడు భూభారతితో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని, ఈ వ్యవహారాలతో రేవంత్ రెడ్డి త్వరలోనే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్న ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలపై న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



# రవిప్రకాశ్ కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

హైదరాబాద్:టీవీ9 వ్యవస్థాపకుడు, మాజీ సీఈవో వి. రవిప్రకాశ్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అసోసియేటెడ్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్య హక్కుల వివాదంలో ఆయనపై నమోదైన ఫోర్జరీ, మోసం, కుట్ర ఆరోపణలకు సంబంధించిన రెండు క్రిమినల్ కేసులను పునరుద్ధరిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై సెప్టెంబర్ 9న విచారణ జరిపింది. తెలంగాణ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి ఆధారాలు కనబడలేదని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రవిప్రకాశ్‌పై నమోదైన రెండు క్రిమినల్ కేసుల విచారణ యథావిధిగా కొనసాగనుంది. టీవీ9 బ్రాండ్‌తో ఛానళ్లను నిర్వహిస్తున్న ఏబీసీపీఎల్‌లో యాజమాన్య మార్పు సందర్భంగా ఈ వివాదం మొదలైంది. 2018లో అలందా మీడియా సంస్థ ఏబీసీపీఎల్‌లో 90.54% వాటాను కొనుగోలు చేసింది. అనంతరం అలందా మీడియా ప్రతినిధి పి. కౌశిక్ రావు 2019లో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు రెండు వేర్వేరు ఫిర్యాదులు చేశారు. నటుడు శివాజీకి రూ.20 లక్షలకు 40,000 ఈక్విటీ షేర్లను విక్రయించినట్లు రవిప్రకాశ్ ఒక నకిలీ ఒప్పంద పత్రాన్ని సృష్టించారని క్రైమ్ నెం. 84/2019లో ఆరోపించారు. కొత్త యాజమాన్యాన్ని అడ్డుకునేందుకే ఈ ఫోర్జరీ పత్రాలను ఉపయోగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును కూకట్‌పల్లి కోర్టు స్వీకరించి, సీసీ నెం. 9286/2022గా విచారణ జరుపుతోంది. రెండో ఫిర్యాదు (క్రైమ్ నెం. 87/2019) ప్రకారం, కంపెనీ సెక్రటరీ దేవేందర్ అగర్వాల్ సంతకాన్ని రవిప్రకాశ్ ఫోర్జరీ చేశారని ఆరోపించారు. కొత్త డైరెక్టర్ల నియామకాన్ని అడ్డుకోవడానికి, దేవేందర్ అగర్వాల్



రాజీనామా చేసినట్లు ఒక తప్పుడు పత్రాన్ని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద అప్‌లోడ్ చేశారని ప్రాసిక్యూషన్ వాదించింది. ఈ కేసు సీసీ నెం. 9288/2022గా విచారణలో ఉంది.

ప్రభుత్వ ఉపసంహరణ ప్రయత్నం, హైకోర్టు జోక్యం

ఈ కేసులు విచారణలో ఉండగా, 2024 మార్చి 15న తెలంగాణ ప్రభుత్వం వాటిని ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ప్రాసిక్యూషన్‌కు విజయావకాశాలు తక్కువగా ఉన్నాయని, ఇది సివిల్ వివాదం లాంటిదని పేర్కొంటూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీని ఆధారంగా కూకట్‌పల్లి కోర్టు 2024 జూన్ 8న కేసుల ఉపసంహరణకు అనుమతి ఇచ్చింది. అయితే, కౌశిక్ రావు ఈ నిర్ణయాన్ని తెలంగాణ హైకోర్టులో సవాలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్, 2025 ఫిబ్రవరి 25న ట్రయల్ కోర్టు ఉత్తర్వులను కొట్టివేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రభుత్వ ఆదేశాలను గుడ్డిగా పాటించారని, కేవలం “పోస్ట్ ఆఫీస్”లా వ్యవహరించారని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కేసులను పునరుద్ధరించి, విచారణను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును రవిప్రకాశ్ సుప్రీంకోర్టులో సవాలు చేయగా, తాజాగా ఆయన పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది.

# వ్యవసాయ విద్యుత్ కోసం రైతుల ధర్నా






వనపర్తి: 12 గంటల విద్యుత్ హామీ.. ఆరు గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదంటూ రైతుల ఆగ్రహం వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా అందక పంటలుఎండిపోతున్నాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామ పెద్దగూడెం రైతులు ఆందోళనకు దిగారు. కడుకుంట్ల గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట, కడుకుంట్ల?వనపర్తి ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కనీసం ఆరు గంటలు కూడా సక్రమంగా, నాణ్యమైన విద్యుత్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా బోర్లు, మోటార్లు పనిచేయక పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. గతంలో విద్యుత్ అందుబాటు తక్కువగా ఉన్న సమయంలోనూ అప్పటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేశారని రైతులు గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ రైతులను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన నేపథ్యంలో అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో సరిపడా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసులు రైతులకు వివరించినట్లు తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసులు రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు నచ్చజెప్పడంతో రైతులు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కేమాణిక్యం, రఘు వర్ధన్ రెడ్డి, మాధవరెడ్డి,ధర్మ నాయక్, డేగ మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, లక్ష్మీకాంత్ రెడ్డి, సర్పంచ్ తిరుపతయ్య, మాజీ సర్పంచ్ హరిత బాలకృష్ణ, మాజీ సర్పంచ్ కొండయ్య, కృష్ణ నాయక్, మనీష్, గ్రామ అధ్యక్షులు వెంకటేష్ అశోక్ నాయకులు రైతులు పాల్గొన్నారు

# వివాదాల్లో సెలబ్రిటీ...





హైదరాబాద్;పేరుకు పేరు.. డబ్బుకు డబ్బు.. ప్రతిష్టకు ప్రతిష్ట.. గౌరవానికి గౌరవం.. ఇంకా చాలా .. వీటన్నింటినీ మన సమాజం వీళ్లకు భారీగానే ఇచ్చింది. పేరూ ఊరూ తెలియకపోయినప్పటికీ నెత్తిన పెట్టుకుంది. సెలబ్రిటీ అనే హోదా ఇచ్చింది. కానీ ఎంతో ఇచ్చిన సమాజానికి వీళ్ళు రిటర్న్ గిఫ్ట్ ఏమిచ్చారో తెలుసా..సెలబ్రిటీలు వివాదాలలో చిక్కుకోవడం మన తెలుగు రాష్ట్రాల్లో కొత్త కాదు. కాకపోతే గతంలో మీడియా ఈ స్థాయిలో లేదు కాబట్టి వాళ్ల గురించి అంతగా తెలిసేది కాదు. కానీ ఇప్పుడు సోషల్ మీడియా బలంగా ఉంది. ఇలాంటప్పుడు సెలబ్రిటీలు జాగ్రత్తగా ఉండాలి. ఎంతో ఇచ్చిన సమాజం పట్ల అప్రమత్తంగా ఉండాలి. తాము చేసే అడుగులను సమాజం జాగ్రత్తగా గమనిస్తోంది అనే సోయి ఉండాలి. ఇది లేకపోతే సెలబ్రిటీలు బొక్కా బోర్లా పడడం ఖాయం. అలా బొక్కా బోర్లా పడి పరువు పోగొట్టుకున్న సెలబ్రిటీల జాబితా ఇప్పుడు ఏంటో చూద్దాం. గతంలో సినిమాలలో నటించేవారిని మాత్రమే సెలబ్రిటీలుగా పరిగణించేవారు. కానీ ఇప్పటి కాలంలో టెలివిజన్.. గాయకులు.. డ్యాన్సర్లు.. సోషల్ మీడియాలో ప్రభావం చూపించగలిగే వారిపై మన సమాజం సెలబ్రిటీ ముద్ర వేసింది. వారందరికీ ఎన్నో రకాలుగా మన సమాజం చేయూత అందిస్తూనే ఉంది. కాకపోతే వారు సమాజం నుంచి భారీగా స్వీకరించి.. చివరికి ఏదో ఒక వివాదంలో చిక్కుకొని పరువు పోగొట్టుకుంటున్నారు.

**మంగ్లీ**

తెలుగు జానపద.. సినీ గాయనిగా.. టెలివిజన్ యాంకర్ గా.. విలక్షణమైన గొంతుతో.. సంప్రదాయ బంజారా దుస్తులు ధరించి.. ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో తెలుగు రాష్ట్రాలలో విశేషమైన గుర్తింపు పొందారు మంగ్లీ. ఈమె అసలు పేరు సత్యవతి రాథోడ్. జూన్ 10, 1994 లో అనంతపురం జిల్లా గుత్తి మండలం బచ్చినపల్లి తండాలో ఒక సాధారణ నిరుపేద బంజారా కుటుంబంలో జన్మించారు ప్రాథమిక విద్యను తండాలో పూర్తీ చేశారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆ సమయంలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆమెలో ప్రతిభను గుర్తించి సంగీతం నేర్చుకునేందుకు ఆర్థిక సహాయం అందించింది. బతుకమ్మ, బోనాలు, సంక్రాంతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, ఉగాది, సమ్మక్క సారక్క వంటి ప్రత్యేక సందర్భాలలో ఆమె పాడిన పాటలు యూట్యూబ్ లో సంచలనం సృష్టించాయి. టాలీవుడ్ లో ఎన్నో సూపర్ హిట్ సినిమాలలో ఆమె పాటలు పాడారు. అలవైకుంఠపురం అనే

సినిమాలో రాములో రాములా.. పుష్ప.. బలగం.. ది ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాల్లో ఆమె పాడిన పాటలు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చాయి. తెలుగులోనే కాకుండా.. కన్నడలో కూడా ఆమె పాటలు పాడారు 2021లో మాస్ట్రో.. 2018లో శైలజా రెడ్డి అల్లుడు.. 2020లో గువ్వా గోరింక అనే సినిమాలలో ఆమె నటించారు. 2020లో తెలంగాణ ప్రభుత్వం ఆమెకు ఉత్తమ జానపద కళాకారిణి అనే పురస్కారం అందించింది. సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్.. ఐఫా ఉత్సవం అవార్డులను ఆమె సొంతం చేసుకున్నారు.. 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెను తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఎస్వీబీసీ ఛానల్ ప్రత్యేక సలహాదారుగా నియమించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ మంగ్లీ 2026 ఏప్రిల్ నెలలో సుమారు 200 కోట్ల మైక్రో ఫైనాన్స్ కుంభకోణానికి సంబంధించిన వివాదంలో కూరుకుపోయారు.

అయితే ఇందులో తనకు.. తన కుటుంబానికి ఎటువంటి ప్రమేయం లేదని మంగ్లీ వివరించారు. ఇందులో రమావత్ మధు అనే వ్యక్తి ఇంట్లో ఒకపూట భోజనం చేసినందుకు తనను ఇబ్బంది పెట్టారని.. రకరకాల ఆరోపణలు చేశారని ఆమె వాపోయారు. దీని వెనక ఎవరి పాత్ర ఉంది.. ఎవరి చేయి ఉంది అనే విషయం పక్కన పెడితే మంగ్లీ తీవ్రమైన వివాదంలో కూరుకుపోయారు. ఇన్ని రోజులపాటు సంపాదించుకున్న మంచి పేరును పోగొట్టుకోవాల్సి వచ్చింది..

**మాధురి రాథోడ్**

తెలంగాణ ప్రాంతానికి చెందిన ఈమె ప్రముఖ జానపద నృత్య కారిణిగా పేరు తెచ్చుకుంది. ఇటీవల మరో ఫోక్ డాన్సర్ ఈశ్వర్ సాయితో కలిసి ఉన్నప్పుడు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడింది. ఈశ్వర్ సాయి భార్య వేములవాడలో మాధురి రాథోడ్.. ఈశ్వర్ సాయిని పట్టుకుంది. ఈశ్వర్ సాయి.. మాధురి రాథోడ్ ఒకే గదిలో ఉండగా ఈశ్వర్ సాయి భార్య శరణ్య వారిద్దరిని పట్టుకున్నట్టు ఒక వీడియో సోషల్ మీడియాలో ఇప్పటికీ సంచలనం సృష్టిస్తోంది. ఈశ్వర్ సాయి భార్య శరణ్య తన మీద ఆకారణంగా దాడి చేసి బూతులు తిట్టిందని.. తన ఐఫోన్ లాక్కుని వెళ్లిందని.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిందని మాధురి మొదట వేములవాడ పోలీసులను ఆశ్రయించింది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకొని ఈశ్వర్ సాయి మోసం చేశాడని మాధురి రాథోడ్ హైదరాబాదులో నార్సింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.కేసు పెట్టి రోజులు అవుతున్నప్పటికీ ఈశ్వర్ సాయిని పోలీసులు అరెస్ట్ చేయకపోవడం పట్ల.. మాధురి ఆగ్రహం వ్యక్తం చేసింది. తనకు న్యాయం జరగడం లేదని మనస్థాపంతో హైదరాబాదులోని పుప్పాలగూడలో తన ఇంట్లో ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కాపాడారు. మాధురి రాథోడ్.. ఈశ్వర్ సాయి మధ్య ఏం జరిగిందో తెలియదు గానీ.. మొత్తానికి ఈ వివాదం ద్వారా మాధురి రాథోడ్ చాలావరకు అవకాశాలను కోల్పోయినట్టేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు తనకు న్యాయం జరగాలని మాధురి రాథోడ్ ఇప్పటికి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూనే ఉంది.

**ఈశ్వర్ సాయి**

కేవలం మాధురి రాథోడ్ మాత్రమే కాకుండా ఈశ్వర్ సాయి కూడా ఈ వివాదంలో పీకలలోతు కూరుకుపోయాడు. బాసింగ బలాలు అనే పాట ద్వారా ఏ స్థాయిలో అయితే గుర్తింపు తెచ్చుకున్నాడో .. మాధురి రాథోడ్తో రెడ్ హ్యాండెడ్ గా దొరికి అదే స్థాయిలో తన పరువు పోగొట్టుకున్నాడు. ఇప్పట్లో అతడు ఫోక్ సాంగ్స్ లో కనిపించడం దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఇప్పటికే అతడు మాధురి రాథోడ్ పోలీసులకు చేసిన ఫిర్యాదులు నేపథ్యంలో అజ్ఞాతంలో ఉన్నాడు. ఒకవేళ అతడు బయటికి వస్తే పోలీసులు అరెస్ట్ చేస్తారు. బెయిల్ మీద బయటకు వచ్చినప్పటికీ ఒకప్పటిలాగా ఈశ్వర్ సాయికి సొసైటీలో గౌరవం ఉండదు. పైగా ప్రొడ్యూసర్లు కూడా ముందుకు రారు.

# నాకు విద్యా శాఖపై ఒక ప్యాషన్ ఉంది

## మూడేళ్లలో విద్యా శాఖ బడ్జెట్ ను రూ.7,554 కోట్లకు పెంచాం.

హైదరాబాద్:తెలంగాణ విద్యా విధానంపై సభలో చర్చ జరగడం ఒక శుభ పరిణామం. సభ్యుల సూచనలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. దేశ తొలి ప్రధాని నెహ్రూ గారు ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రెండు అంశాలను ప్రాధాన్యతగా తీసుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయన శాసనసభలో మాట్లాడారు. దేశంలోని ఏ విద్యా సంస్థ అయినా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వేసిన పునాదులపైనే నిర్మితమైంది. ఇప్పుడున్న చాలా యూనివర్సిటీలు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసినవే. విద్య ఒక్కటే మన జీవితాల్లో వెలుగును తీసుకొస్తుందని సంపూర్ణంగా నమ్ముతున్నా. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సీపెక్ సర్వే నిర్వహించింది. సామాజిక వెనుకబాటుకు ఆస్తులు అంతస్తులు కాదు? విద్య లేకపోవడమే సామాజిక వెనుకబాటు తనానికి కారణమని సర్వేలో తేలింది. ప్రపంచంతో పోటీ పడాలంటే విద్య విధానంలో తీసుకు రావాల్సిన అంశంపై చర్చించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ నూతన విద్యా విధానం రూపొందించేందుకు విద్య కమిషన్ ను ఏర్పాటు చేశాం. విద్యా కమిషన్ అందించిన రిపోర్ట్ ను పరిశీలించేందుకు కేకే నేతృత్వంలో ఒక కమిటీని నియమించాం. మీ సూచనలు, సలహాలను కేశవరావు గారికి అందిస్తే ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉంది. విద్య కోసం 15 శాతానికి బడ్జెట్ ను పెంచడమే మా లక్ష్యం. పూర్తిస్థాయి విద్యా శాఖ మంత్రి లేడని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అంటున్నారు. ముఖ్యమంత్రి ఆ శాఖను నిర్వహిస్తున్నారంటే అది అత్యంత ప్రధానమైనదని అర్థం. ముఖ్యమంత్రిగా నేను ఎడ్యుకేషన్ సమీక్ష చేస్తే మొత్తం సిస్టమ్ వచ్చి సమీక్షలో ఉంటుంది. ఈ మాత్రం తేడా కూడా సభ్యుడికి తెలియకపోవడం బాధాకరమని అన్నారు. నాకు విద్యా శాఖపై ఒక ప్యాషన్ ఉంది.



2023-24 బడ్జెట్ లో బీఆరెస్ ప్రభుత్వం విద్యా శాఖ కు రూ. 19,093 కోటల కేట్లయిస్తే.. మా ప్రభుత్వం 2024-25 బడ్జెట్ లో రూ. 21,292 కోట్లు కేటాయించింది . 2025-26 బడ్జెట్ లో ఆ మొత్తాన్ని రూ. 23,108 కోట్లకు, 2026-27 బడ్జెట్ లో రూ. 26,647 కోట్లకు పెంచాం. కేవలం మూడేళ్లలో విద్యా శాఖ బడ్జెట్ ను రూ. 7,554 కోట్లకు పెంచాం. మేం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 55 రోజుల్లోనే 10,006 మంది టీచర్ల ఉద్యోగాలు భర్తీ చేశాం చిన్న ఆరోపణ లేకుండా ఉద్యోగ నియామకాలు పూర్తి చేశాం. గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 7857 మంది టీచర్లను నియమించారు. జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరానికి కూడా దృష్టిలో ఉంచుకుని విద్యా విధానం తీసుకొస్తున్నాం. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని, తలరాతలు మార్చేది విద్యా అని నమ్మి విద్యా శాఖ నా దగ్గర పెట్టుకున్నా నని అన్నారు. ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొస్తున్నాం . కొన్నిసార్లు కొన్ని నిర్ణయాలు చేసినపుడు కొన్ని వివాదాలు జరుగుతాయి . అలాంటిదే పాలిటెక్నిక్ కాలేజీలకు సంబంధించిన జీవో ఎంఎస్ నెం.97 . నేను విద్యా శాఖ మంత్రిగా బాధ్యత తీసుకున్నాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మంది పెరిగారు. ఇది విద్యా శాఖ మంత్రిగా నా పనితీరుకు నిదర్శనమని అన్నారు.

# భారత రాజ్యాంగం

## 16వ భాగము

కొన్ని తరగతుల విషయంలో ప్రత్యేక నిబంధనలు (Special provisions relating to certain classes)

ఆర్టికల్ 330 : లోక్సభలో షెడ్యూల్డు కులాల వారికి మరియు షెడ్యూల్డు తెగల వారికి సీట్ల ప్రత్యేకింపు :−(1) లోకసభలో

(ఎ) షెడ్యూల్డు కులాలకు,

(బి) అస్సాంలో స్వయం ప్రతివత్తి (అటానమస్) జిల్లాలలోని షెడ్యూల్డు జాతులు మినహాయించి షెడ్యూలు జాతులు వారికి, మరియు

[Subs. by the Const. (41st Amdt.) Act, 1984 w.c.f. 16-6-1986]

(సి) అస్సాంలోని స్వయం ప్రతిపత్తి జిల్లాలలోని షెడ్యూల్డు తెగల వారికి, సీట్లు ప్రత్యేకించాలి.

(2) క్లాజు (1) క్రింద షెడ్యూల్డు కులం వారికి, లేక షెడ్యూల్డు తెగల వారికి ఏదేని రాష్ట్రము ళిలేదా కేంద్ర పాలిత ప్రాంతంలోరి (రిజర్వు చేసిన) సీట్ల సంఖ్యకును, లోకసభలో ఆ రాష్ట్రం (లేదా కేంద్ర పాలిత ప్రాంతమునకురి కేటాయించిన మొత్తం సీట్ల సంఖ్యకును గల అనుపాతము, ఆ రాష్ట్రం ళిలేదా కేంద్రపాలిత ప్రాంతంలోనిరి షెడ్యూల్డు కులముల జనాభా లేదా సందర్భానుసారంగా, ఆ రాష్ట్రంలోని ళిలేదా కేంద్ర పాలిత ప్రాంతంలోనిరి లేదా ఆ రాష్ట్రం ళిలేక కేంద్ర పాలిత ప్రాంత భాగంలోనిరి షెడ్యూల్డు తెగల జనాభా ఆ రాష్ట్రం ళిలేదా కేంద్ర పాలిత ప్రాంతవురి మొత్తం ఆ జనాభా ఏ అనుపాతములో ఉందో ఆ అనుపాతమునకు సాధ్యమైనంత దగ్గరగా వుండాలి.

:భారత రాజ్యాంగము




(3) క్లాజు (2) లో ఏమున్నప్పటికినీ, లోకసభలో అస్సాంలోని స్వయం ప్రతిపత్తి జిల్లాలోని షెడ్యూల్డు తెగల వారికి రిజర్వు చేసిన సీట్ల సంఖ్యకును ఆ రాష్ట్రమునకు కేటాయించిన మొత్తం సీట్ల సంఖ్యకును గల అనుపాతము, ఆ స్వయం ప్రతిపత్తి జిల్లాలోని షెడ్యూలు తెగల జనాభారును ఆ రాష్ట్ర మొత్తం జనాభాకు గల అనుపాతమునకు తగ్గకుండా ఉండవలెనీ.

1[Inst. by the Const. (31st Amdt.) Act, 1973)

:--- ఈ ఆర్టికలులోనూ, 332వ ఆర్థికలులోనూ 'జనాభా' అను పదమునకు కట్టకడపటిదియూ అందుకు సంబంధించిన అంకెలు ప్రచురించబడినట్టిదియూ అగు, జనాభా లెక్కల సేకరణలో నిర్ధారించబడిన జన సంఖ్య అని అర్థం.

అయితే, ఈ విశదీకరణలో కట్టకడపటిదియూ, అందుకు సంబంధించిన అంకెలు ప్రచురించబడినట్టిదియూ అగు జనాభా లెక్కల సేకరణకు గల నిర్దేశమును, [2026) సంవత్సరమునకు తరువాత చేయబడు మొదటి జనాభా లెక్కల సేకరణలోని అంకెలు ప్రచురించబడునంతవరకు 2001రివ సంవత్సరపు జనాభా లెక్కల సేకరణకు చేయబడిన నిర్దేశముగా అన్వయించుకొనవలెను. [Sub. by the Const. (84th Amdt.) Act, 2001,

ఆర్టికల్ 331 : లోక్ సభలో ఆంగ్లో ఇండియను సమాజమునకు ప్రాతినిధ్యము :- 81వ ఆర్టికలులో ఏమున్నప్పటికీ, రాష్ట్రపతి లోకసభలో ఆంగ్లో ఇండియను సమాజమునకు తగినంత ప్రాతినిధ్యము లేదని, అభిప్రాయపడినచో, ఆ సమాజమునకు చెందిన ఇద్దరు కంటే ఎక్కువ కాని సభ్యులను, లోక్ సభకు నామినేటు చేయవచ్చును.

ఆర్టికల్ 332 : రాష్ట్ర శాసన సభలలో షెడ్యూల్డు కులాల వారికి, షెడ్యూల్డు తెగల వారికి సీట్ల ప్రత్యేకింపు :(1) అస్సాములోని స్వయం ప్రతివత్తి జిల్లాలలోని షెడ్యూల్డు తెగలను మిహాయించి ప్రతి రాష్ట్ర శాసన సభలోనూ, షెడ్యూల్డు కులాల వారికి, షెడ్యూల్డు తెగల (.] [Sub. by the Const. (51st Amdt.) Act, 1984, w.e.f. 16-6-1986]

(2) అస్సామ్ రాష్ట్ర శాసన సభలో, స్వయం ప్రతిపత్తి జిల్లాలకు కూడా సీట్లను ప్రత్యేకించాలి.

(3) ఏదేని రాష్ట్ర శాసనసభలో క్లాజు (1) క్రింద షెడ్యూల్డు కులాల వారికి, లేక షెడ్యూల్డు తెగల వారికి ప్రత్యేకించిన సీట్ల సంఖ్యకును, ఆ నభలోని మొత్తము సీట్ల సంఖ్యకును గల అనుపాతము, సందర్భానుసారంగా ఆ రాష్ట్రములోని షెడ్యూల్డు కులముల లేక ఆ రాష్ట్రము లేదా ఆ రాష్ట్ర భాగంలోని షెడ్యూల్డు తెగల జనాభాకును, ఆ రాష్ట్ర మొత్తము జనాభారును గల అనుపాతమునకు సాధ్యమైనంత దగ్గరగా ఉండవలెను.

(3–ఏ) క్లాజు (3) లో ఏమున్నప్పటికినీ 2026 సంవత్సరము తరువాతిదైన మొదటి జనాభా లెక్కల సేకరణ ప్రాతిపదికపై 170వ ఆర్టికలు క్రింద అరుణాచలప్రదేశ్, మేఘాలయ, మిజోరం, నాగాలాండు రాష్ట్రాల శానన నభలలోని సీట్ల సంఖ్యలో తిరిగి నర్దుబాటు చేయబడునంతవరకు, ఏదేని అట్టి రాష్ట్ర శాసన సభలో

(ఎ) రాజ్యాంగ (57వ నవరణ) చట్టం, 1987 అమలులోనికి వచ్చి తేదీన (ఈ క్లాజులో ఇటు తర్వాత ప్రస్తుత శానననభగా పేర్కొనబడునని అట్టి రాష్ట్ర శానననభలో వున్న

కొన్ని తరగతుల విషయంలో ప్రత్యేక నిబంధనలు

సీటు అన్ని యూ, షెడ్యూలు తెగలకు చెందిన సభ్యులు కలిగి ఉన్న యెడల, అందులో ఒకటి తప్ప మిగతా అన్ని సీట్లు;

(బి) ఏదేని ఇతర సందర్భాలలో, అట్టి సీట్ల సంఖ్యకు, మొత్తం సీట్ల సంఖ్యకు అనుపాతము నదరు తేదీ నాటికి ప్రస్తుత శాసన నరలో షెడ్యూలు తెగలకు చెందిన సభ్యుల సంఖ్య ప్రస్తుత శాసన సభలోని మొత్తం సీట సంఖ్య ఏ అనుపాతములో మందో అ అనుపాతమునకు తగకుండా, షెడ్యూలు తెగలకు చెందిన వారికి ప్రత్యేకించవలెను.

(3–బీ) క్లాజు (3) లో ఏమున్నప్పటికినీ, లిళి2026రి సం॥ తరువాతిదైన మొదటి జనాభా లెక్కల సేకరణ ప్రాతిపదికపై 170 వ ఆర్థికలు క్రింద త్రిపుర రాష్ట్ర శాసన సభలోని సీట్ల సంఖ్యలో తిరిగి సర్దుబాటు చేయబడునంతవరకు, ఆ శానననభలో షెడ్యూలు తెగలకు ప్రత్యేకించబడిన సీట్లకును, రాజ్యాంగ (72 వ సవరణ) చట్టం, 1992 అమల్లోకి వచ్చిన తేదీన, అట్టి తేదీ నాటికి ప్రస్తుత శాసనసభలోని షెడ్యూల్డు తెగల సభ్యుల సంఖ్యకునుగల అనుపాతము ఆ శానన నభమొత్తం సీట్ల సంఖ్య షెడ్యూల్డు తెగల సభ్యుల సీట్ల అనుపాతము తగ్గకుండా ఉండవలెను.

[Inst. by the Const. (72nd Amdt.) Act, 1992 w.e.f. 5-12-1992] [Sub.by the Const. (84th Amdt.) Act, 2001, w.e.f. 21-2-2002]

(4) అస్సామ్ రాష్ట్ర శాసన సభలో ఒక స్వయం ప్రతివత్తిగల జిల్లాకు ప్రత్యేకించబడిన సంఖ్యకును, ఆ సభలోని మొత్తం సీట్ల సంఖ్యకును గల అనుపాతము, ఆ జిల్లా యొక్క మొత్తం జనాభాకు, గల అనుపాతమునకు తగ్గకుకుండా ండా ఉ ండవలెను.

(5) అస్సామ్ లోని ఏదేని న్వయంప్రతిపత్తి గల జిల్లాకు ప్రత్యేకించబడిన సీట్ల కొరకు గల నియోజకవర్గములలో

ఆ జిల్లా వెలువలి ఏ ప్రాంతమైనను చేరి ఉండరాదు. [Certain words omitted by the North Eastern Areas (Reorganisation) Act, 1971, w.e.f. 21-1-1972]

(6) అస్సామ్ రాష్ట్రవు స్వయం ప్రతివత్తిగల ఏదేని జిల్లాకు షెడ్యూల్డు తెగకు చెందని ఏ వ్యక్తియు, ఆ జిల్లాలోని ఏ నియోజకవర్గము నుండైనను రాష్ట్ర శాననసభకు ఎన్నుకొనబడుటకు [Certain words omitted by the North Eastern Areas (Reorganisation) n
Act, 1971, w.e.f. 21-1-1972]

అయితే, అస్సామ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు, అట్లు అధినూచించబడి బోడోలాండ్ భూభాగముల జిల్లా (Bodo Land Teritorial Areas Dist.) ఏర్పాటుకు పూర్వము అమలునందున్న బోడోలాండ్ భూభాగముల జిల్లాలో చేర్చబడిన నియోజకవర్గములలోని షెడ్యూల్డు తెగల, షెడ్యూల్డేతర తెగల ప్రాతినిధ్యము కొనసాగవలెను.

[Inst. by the Const. (90th Amdt.) Act, 2003, w.e.f. 28-9-2003]

ఆర్టికల్ 333 : రాష్ట్ర శాసన సభలలో ఆంగ్లో ఇండియను సమాజమునకు ప్రాతినిధ్యము :–170వ ఆర్థికలులో ఏమున్నప్పటికినీ, ఏ రాష్ట్ర శాసనసభలోనైనను ఆంగ్లో ఇండియను సమాజమునకు ప్రాతినిధ్యము ఆవశ్యకమనియూ, దానికి తగినంత ప్రాతినిధ్యము లేదనియు ఆ రాష్ట్ర గవర్నరు అభిప్రాయవడినచో. ఆయన శిఆ సమాజమునకు చెందిన ఒక సభ్యుని ఆ రాష్ట్ర * 2 2

[Subs. by the Const. (23rd Amdt.) Act, 1969]

భారత రాజ్యాంగము

ఆర్టికల్ 334:

ప్రత్యేకింపు మరియు పోష ప్రాతినిధ్యము కొద్ది కాలము) తరువాత రరగులు: ఈ భాగము ఇంతకుముందు చెప్పబడిన నిబంధనలలో ఎదు

(ఎ) లోకసభలోనూ మరియు రాష్ట్ర శాసనసభలోనూ షెడ్యూల్డు కులముల వారికి షెడ్యూల్డు తెగల వారికి సీట్లు ప్రత్యేకించుటకై,

(బి) లోక్సభలోనూ మరియు రాష్ట్ర శాసనసభల్లోనూ నామినేటు వేయుట ద్వారా ఆంగ్లో ఇండియను సమాజ ప్రాతినిధ్యముకైన.

ఈ రాజ్యాంగ నిబంధనలు, ఈ రాజ్యాంగ ప్రారంభం నుండి లి) ఖండము (ఎ)కు సంబంధించి ఎనభై సంవత్సరములు మరియు ఖండము (బి)కు నంబంధించి చెబ్బైనంవత్సరములురి ముగియగానే
చెల్లకుండా పోవలెను.
అయితే, ఈ ఆర్థికలులో ఉన్నదేదియు సందర్భానుసారముగా లోక్సభ యొక్క లేక ఏ రాష్ట్ర శాసనసభ యొక్క విఘటన జరుగువరకు లోకసభలోని లేక నదరు శాసన సభలోని వి ప్రాతినిధ్యము కొరకైనను భంగము కలిగించరాదు.
[Subs. by the Const. (104 Amdt.) Act, 2020 w.e.f. 21-1-2000)
ఆర్టికల్ 335 : షెడ్యూల్డు కులాల వారికి మరియు పెద్యూల్డు తెగల వారికి సర్వీసుల్లోను మరియు పోస్టులలోను క్లెయి సర్వీసుల్లోను మరియు పోస్టులలోను నియామకములను చేయుటలో వరిపాలనా సామర్థ్య క్లెయిములు :–యూనియను లేదా రాక్ష వ్యవహారములకు సంబంధించిన నిర్వహణకు అనుగుణంగా "షెడ్యూల్డు కులముల వారి మరియు షెడ్యూల్డు తెగలవారి క్లెయిములను పరిశీలనలోనికి తీసుకొనవలెను:
శిఅయితే, యూనియన్ లేదా ఒక రాష్ట్ర వ్యవహారములకు సంబంధించిన ఏదేని తరగతి లేదా తరగతులకు చెందిన సర్వీసులలోనూ లేదా పోస్టులోనూ ప్రమోషన్ ఇచ్చు

విషయాలలో ప్రత్యేకించుటకు కొరకు షెడ్యూల్డు కులాలు లేదా షెడ్యూల్డు తెగల సభ్యులకు అనుకూలంగా ఏదేని పరీక్షలోని అర్హత మార్కులను ?కలను నడలించుటకు లేదా ప్రమాణములను తగ్గించుటకు ఈ ఆర్టికల్స్ నున్నదేదియు నివారించదు.

[Ins. by Const. (82nd Amdt.) Act, 2000 Sec.2 w.e.f. 8-9-2000)

ఆర్టికల్ 336 : కొన్ని సర్వీసులలో ఆంగ్లో ఇండియన్ సమాజమునకు విశేష నిబంధన :- ఈ రాజ్యాంగం ప్రారంభమైన తరువాత మొదటి 2 సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వము యొక్క రైల్వే, కస్టమ్స్ పోస్టలు మరియు టెలిగ్రాఫు సర్వీసులలో ఆంగ్లో ఇండియను సమాజ సభ్యుల నియామకములు, 1947 ఆగష్టు 15 తేదీకి ముందు ఉండినట్టి ప్రాతివేదిక పైననే జరగవలెను.

తరువాత ప్రతి 2 సంవత్సరముల కాలావధిలో నదరు సర్వీసుల్లో ఈ నమాజవు సభ్యులకు ప్రత్యేకించిన పోస్టుల సంఖ్య అంతకు వెంటనే ముందు 2 సంవత్సరముల కాలావధిలో ప్రత్యేకించిన సంఖ్యకన్నా సాధ్యమైనంత వరకు 10 శాతం తక్కువగా ఉండవలెను.

అయితే, ఈ రాజ్యాంగము ప్రారంభమైనప్పటి నుండి 10 సంవత్సరములు ముగిసేనాటికి అట్టి రిజర్వేషన్లన్నియు రద్దు కావలెను.

(2) క్లాజు (2) లో ఆంగ్లో ఇండియన్ సమాజమునకు చెందిన వ్యక్తులు ప్రతిభ కారణము పై ఇతర సమాజములకు చెందిన వ్యక్తులతో పోల్చినపుడు నియామకమునకు అర్హులైనచో ఈ కొన్ని తరగతుల విషయంలో ప్రత్యేక నిబంధనలు

407 క్రింద వానికి ప్రత్యేకించబడినవి కాక ఇతర మైనవగు పోస్టులలోను లేక ధనమైనవగు కొనలలోను వారి నియామకమునకు క్లాజు (1)లో ఉన్నిదేదియు అడ్డం కారాదు.

ఆర్టికల్ 337ఆంగో అండియన్ సమాజ శ్రేయస్సు కొరకు విద్యా గ్రాంటు అచ్చుటన ఫోపి విబశీచసి రాజ్యాంగం ప్రారంభమైనప్పటి నుండి మొదటి మూడు అధిక సంవత్సరముల కాలంలో కేంద్ర ప్రభుత్వము మరియు ప్రతి రాన ప్రభుత్వము ౯ ఆంగ్ జడియను సమాజం మేలు కొరకు 1948 మార్చి 31 వ తేదీతో అంతమగు ఆర్థిక సంవత్సరములో రా విజయముగా వారికి చెల్లిస్తుండిన గ్రాంపై ఇవ్వవలెను.

*[Omitted by the Const. (7th Amat) Act, 1956)

తరువాత ప్రతి మూడు సంవత్సరముల కాలావధిలోను ఈ గ్రాంట్లు వెంటనే ముందుగల ష్పరీడు సంవత్సరముల కాలావధిలో ఇచ్చిన గ్రాంట్ల కంటే 10 శాతం తక్కువగా ఉండవచ్చును. అయితే, ఈ రాజ్యాంగము ప్రారంభమైనప్పటి నుండి పది సంవత్సరములు ముగియగానే అటి గ్రాంట్లు, ఆ అంగో ఇండియన్ నమాజమునకు అవి విశేష రాయితీలె యున్నంత కావలెను. మేరకు

వద్దు అంతే కాకుండా, ఏ విద్యా సంస్థయు, అందులో ప్రతి సంవత్సరము చేర్చుకొనబడు వారిలో కవనము నూటికి 40 శాతం మంది ఆంగ్లో ఇండియనులు కాని ఇతర నమాజములకు చెందిన వ్యక్తులై ఉండిననే తప్ప ఈ అరికలు క్రింద ఎట్టి గ్రాంట్లను గాని పొందుటకు హక్కు కలిగి ఉండరాదు.

(ఆర్టికల్ 338 : షెడ్యూల్డు కులాల వారికి జాతీయ కమిషనురి :-(1) షెడ్యూల్డు కులాల వారికి జాతీయ షెడ్యూల్డు కులాల కమీషను ఒకటి ఉండవలెను.

(2) ఈ విషయంలో పార్లమెంటుచే చేయబడు ఏదేని కాననవు నిబంధనలకు లోబడి, ఈ కమీషను చైర్పర్సన్, వైస్ చైర్పర్సను మరియు ముగ్గురు ఇతర సభ్యులతో ఏర్పడవలెను. అట్లు నియమించబడిన చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ ఇతర సభ్యుల సర్వీసు నిబంధనలు మరియు పదవీ కాలావధులు రాష్ట్రపతి నియమముల ద్వారా నిబంధించినట్లుండవలెను. ౨

[Clauses (1) & (2) are subs. by the Const. (89th Amdt.) Act, 2003, w.e.f. 19-2-2004]

(3) ఈ కమిషను యొక్క ఛైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ మరియు ఇతర సభ్యులను రాష్ట్రపతి తన చేవ్రాలు మరియు సీలుతో కూడిన వారంటు ద్వారా నియమించవలెను.

# చాచిన మట్టి చేతులు

# సాహిత్యం



రెండు సంజల మధ్య దూరం నీకు ఒక రాత్రి కావచ్చు
నాకు మాత్రం ఒక పగలు
చుక్కల చీర కప్పుకుంటూ నేను చీకటి బురఖా విప్పుకుంటూ
నువ్వు

వెలుగు నీడల రాకపోకల కోసం ఒకే స్టేషన్లో ఎదురెదురుగా యిద్దరంచాచుకుంటూ వస్తున్న మన రెండేసి చేతుల్ని చూసి గట్టిగా వాటేసుకుంటామనే అనుకుంటారంతా తీరా దగ్గర కొచ్చేక రెండేసి రైలు పట్టాల్లా పరస్పరాభిముఖంగా పక్క పక్క నుంచే అటు నువ్వూ, ఇటు నేనూసంజ నుంచి సంజ దాకా ఎటు నుంచి ఎటయినా ఒక సుదీర్ఘ యాత్రబతుకంతా ఆరుబయిలయిన నాకు శరీరాన్ని కప్పలేని చింకి పాతల మీది కోపం గుడ్లప్పగించి చూసే సూర్యుడి మీద కలుగుతుంది.

ఒకప్పుటి ఎర్రని నా శరీరఛాయ గురించి ఎవరు చెబుతాడా మండుటెండలో పాలిచ్చిన అమ్మ తప్పనల్లని బొగ్గు ఎర్రతనానికి మండే కొలిమి ఒక్కటే సాక్ష్యం.

తీసేకొద్దీ మొలిచే కలుపు మోసేకొద్దీ పెరిగే బరువు ఎడతెగని వేడిమీ వెలుతురూనడుము వంగినంత సులువుగా పొద్దు కుంగదుపగలంతా పురిటి నొప్పుల నిరీక్షణే రాత్రిసాని వచ్చే వేళక్కాని సుఖ ప్రయాణం మొదలు కాదు నాకు సుఖమంటే కాలిన బొగ్గు మీద కాసిన్ని నీళ్ళు చల్లడమే
అంతరంగమంతా అంత:పురమైన నీకు కాపలా కాస్తున్న గోడల మీది కోపం నీడ నిచ్చే కప్పుమీద కలుగుతుంది.

నాన్న ఛాతీ మీద నర్తించిన నీ చిట్టిపాదాల స్వేచ్ఛ
గురించి ఎవరు చెబుతారు?
కాళ్ళూ, చేతులూ సాగదీసి నలుగు పెట్టిన అమ్మ తప్ప పక్షి

ఎగిరిందని చెప్పడానికి అలసిన రెక్కలే సాక్ష్యం

వయసొచ్చే కొద్దీ ఘోషా అవయవాలు పెరిగే కొద్దీ సిగ్గు
ఎక్కడ తడిమినా చీకటే
ఒళ్ళప్పగించినంత మాత్రాన తెల్లవారదు
రాత్రంతా ఇంటిదొంగల అప్పగింతలే పగటి ప్రియుడు
చుంబిస్తే కాని బండి కదలదు
నీకు కదలికంటే చెక్కిలి మీది కన్నీటి చుక్క పెదవుల మీద
పడటమే
మనం కలిసే చోట విడిపోతున్నామా? విడిపోయే చోట
కలుస్తున్నామా?

ఒక సంజ తొలిపలుకు మరొక సంజ మలిపలుకు
మధ్యలో రెండు విషాదారంభ కావ్యాలు
అంటనంటూనే అలుముకుంటాడు నన్ను అలుముకుంటూనే
అంటనంటాడు నిన్ను

ఒకడు తరుముతాడు.

ఇంకొకడు తలుపులు మూస్తాడు

నేను–

గుండెల మీదా, గుడిసె మీదా కప్పులేని దాన్ని నీ ఒంటి మీదే కాదు, నీ ఇంట్లోనైనా నీడల చారల్ని చూస్తే ఈర్ష్యపడతాను.

నాలుగ్గోడలక్కర్లేదు కాని ఒక్క నీడ కావాలి ఒళ్ళు దాచుకోవడానికి అరచేతి నీడ కావాలి.
ద్వారబంధాలు అక్కర్లేదు కాని ఒక్క ద్వారం కావాలి తల ఎత్తి లోనికెళ్ళినా తగలని ద్వారం కావాలి

తరుముకొచ్చే పగటికాపు వాకిలి నుంచే తోక ముడవాలి.

నువ్వు–

ఒంటి కప్పు మీద వున్న హక్కు ఒంటి మీద లేనిదానివి

అలాగని చీరల్ని తగలెయ్యకు తెల్లని నీ వితంతు వస్త్రం మీద నల్లని చుక్కలన్నీ నేనే

నీ గోడల్ని కూల్చేసుకో కాని, అరచేతులు జాగ్రత్త వాటి మీద పండిన నా గోరింటాకు నీడలున్నాయి.

తలుపుల్ని తన్నేసెయ్ నీ పాదాలు జాగ్రత్త చీకటి ధూళితో పాటు నా వెండివెన్నెల గజ్జెలున్నాయి.

ఎన్నాళ్ళీ ఎదురెదురు బెదురు ప్రయాణాలు?

నాజూకైన స్వప్నాల్లో నాలుగు బాహువులు కలవనే కలవ్వు

నా దాకా వస్తే బరి తెగించిన కలనొక దాన్ని బయిట పెడతాను: ఎర్రని రెండు సంజల మధ్య దూరాన్ని పండిన రెండు పెదవుల మధ్య దూరానికి కుదించినట్లు.

అప్పుడు అడ్డంగా చిరునవ్విక వికసించక చస్తుందా?


## Advertisment Tariff

| | | |
|---|---|---|
| కలర్ ఫుల్ పేజీ (బ్యాక్) | : | రూ.50,000/- |
| కలర్ ఆఫ్ పేజీ (బ్యాక్) | : | రూ.30,000/- |
| కలర్ క్వాటర్ పేజీ (బ్యాక్) | : | రూ. 20,000/- |

## బ్లాక్ & వైట్

| | | |
|---|---|---|
| ఫుల్ పేజీ | : | రూ.30,000/- |
| ఆఫ్ పేజీ | : | రూ. 20,000/- |
| క్వాటర్ పేజీ (బ్యాక్) | : | రూ. 10,000/- |

**Cell : 9381205266**
**8977022449**

## విలేకరులు కావలెను

తెలంగాణ వ్యాప్తంగా మీ ముందుకు వస్తున్న

**జన సమయం**

పక్షపత్రికకు

తెలంగాణలోని అన్ని నియోజక వర్గాల నుండి

**విలేకరులు కావలెను**

ఆసక్తి కలిగినవారు సంప్రదించండి

**సెల్ : 9381205266**
**8977022449**

# ఆరోగ్యానికి 'బాదం' భాగ్యం: ఆరోగ్యం

మన నిత్య జీవితంలో ఆహార అలవాట్లు, పని ఒత్తిడి, కాలుష్యం వల్ల ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో మన శరీరానికి అవసరమైన పోషకాలను అందించి, నిండు నూరేళ్ల ఆరోగ్యాన్ని ప్రసాదించే దివ్యౌషధం 'బాదం' ప్రాచీన ఆయుర్వేదం నుండి నేటి ఆధునిక వైద్యశాస్త్రం వరకు బాదంను ఒక "సూపర్ ఫుడ్"గా కొనియాడుతున్నాయి. మరి బాదం పప్పులను నిత్యం మన ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఎలాంటి అద్భుత ప్రయోజనాలు కలుగుతాయో వివరంగా తెలుసుకుందాం...

1. మెదడు చురుకుదనం -- జ్ఞాపకశక్తి పెంపు

"బాదం తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది" అని మన పెద్దలు తరచూ చెప్పే మాట అక్షర సత్యం. బాదంలో విటమిన్-ఈ , రైబోఫ్లేవిన్, ఎల్-కార్నిటైన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.

ఇవి మెదడు నరాలను ఉత్తేజపరిచి, జ్ఞాపకశక్తిని, దృష్టి ఏకాగ్రతను పెంచుతాయి.

వయసు పెరిగే కొద్దీ వచ్చే అల్జీమర్స్, మతిమరుపు వంటి నాడీ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా ఇవి రక్షణగా నిలుస్తాయి. పిల్లల మానసిక వికాసానికి బాదం ఎంతో మేలు చేస్తుంది.

2. గుండెకు కొండంత అభయం

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి, మంచి కొలెస్ట్రాల్ పెరగడం ఎంతో అవసరం. బాదంలో ఉండే మోనో-అన్‌శాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలు మరియు యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్ (ాణూా) స్థాయిలను తగ్గిస్తాయి.

రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా నివారించి, రక్త ప్రసరణను వేగవంతం చేస్తాయి.



ఫలితంగా గుండెపోటు , నిరోధక సమస్యల ముప్పు గణనీయంగా తగ్గుతుంది. బాదంలో ఉండే మెగ్నీషియం బిపి (రక్తపోటు) ని అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది.

3. బరువు తగ్గాలనుకునే వారికి సరైన ఎంపిక

అధిక బరువుతో బాధపడేవారికి బాదం ఒక అద్భుతమైన స్నాక్. ఇందులో ప్రోటీన్లు, నార పదార్థం (ఫైబర్), మరియు ఆరోగ్యకరమైన కొవ్వులు ఎక్కువ మోతాదులో ఉంటాయి.

రెండు లేదా మూడు బాదం పప్పులు తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇది పదే పదే ఆకలి వేయడాన్ని అరికడుతుంది. అనవసరమైన జంక్ ఫుడ్ తినే అలవాటును తగ్గించి, బరువును సులువుగా నియంత్రణలో ఉంచుతుంది.

4. మధుమేహం (డయాబెటిస్) నియంత్రణ

మధుమేహ గ్రస్తులకు బాదం ఒక వరప్రసాదం. బాదంలో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండి, ప్రోటీన్లు, ఫైబర్ మరియు మెగ్నీషియం అధికంగా ఉంటాయి.

భోజనం తర్వాత రక్తంలో షుగర్ స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా బాదం అడ్డుకుంటుంది.

ఇన్సులిన్ సున్నితత్వాన్ని (×అంబశ్రీఅఅ ాావఅంత్అజత్ఎ) మెరుగుపరచడంలో బాదంలోని మెగ్నీషియం కీలక పాత్ర పోషిస్తుంది.

5. ఎముకలకు, దంతాలకు బలం

బాదంలో క్యాల్షియం, ఫోలేట్, మెగ్నీషియం మరియు ఫాస్ఫరస్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఎముకలను, దంతాలను దృఢంగా ఉంచడానికి సహాయపడతాయి.

# ఆరోగ్యానికి సిరి.. ఔషధాల గని లవంగం!

మన భారతీయ సాంప్రదాయ వంటకాల్లోనూ, ఆయుర్వేదంలోనూ లవంగానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. వంటకాలకు రుచి, సువాసన ఇవ్వడమే కాకుండా, శరీరానికి అవసరమైన ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందించడంలో లవంగం అద్భుతంగా పనిచేస్తుంది.

లవంగం యొక్క ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు

దంత ఆరోగ్యం �d పంటి నొప్పి నివారణ: లవంగంలో ఉండే యూజెనాల్ (జుబస్త్రవఅశీశ్రీ) అనే రసాయనం సహజ నొప్పి నివారిణిగా మరియు క్రిమిసంహారిణిగా పనిచేస్తుంది. పంటి నొప్పి ఉన్న చోట లవంగం లేదా దాని నూనె ఉంచితే తక్షణ ఉపశమనం లభిస్తుంది. ఇది నోటి దుర్వాసనను తొలగించి, చిగుళ్ల సమస్యలను అరికడుతుంది.

జీర్ణ వ్యవస్థ మెరుగుదల: భోజనం తర్వాత ఒక లవంగాన్ని నమలడం వల్ల జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తి పెరుగుతుంది. దీనివల్ల గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం మరియు అసిడిటీ సమస్యలు తగ్గుతాయి. వికారంగా ఉన్నప్పుడు లవంగం నమలడం వల్ల నయం అవుతుంది.

రోగనిరోధక శక్తి పెంపు: లవంగాలలో విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ మరియు మాంగనీస్ సమృద్ధిగా ఉంటాయి. జలుబు, దగ్గు, గొంతు నొప్పితో బాధపడేవారు లవంగాల కషాయం లేదా లవంగాల టీ తాగితే తక్షణ రక్షణ లభిస్తుంది.

రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ: లవంగంలో ఉన్న సమ్మేళనాలు శరీరంలో ఇన్సులిన్ నిరోధకతను తగ్గించి, గ్లూకోజ్ స్థాయిలను క్రమబద్ధీకరించడంలో



సహాయపడతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది ఎంతగానో మేలు చేస్తుంది.

కీళ్ల నొప్పులు d వాపుల ఉపశమనం: లవంగంలోని యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. లవంగం నూనెతో నొప్పులు ఉన్న చోట మసాజ్ చేయడం వల్ల తక్షణ ఉపశమనం లభిస్తుంది.

కాలేయ భద్రత: ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో పేరుకుపోయే వ్యర్థాలను (టాక్సిన్లు) తొలగించి ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు రాకుండా కాపాడుతాయి.

ఎలా ఉపయోగించాలి?

ప్రతిరోజూ 1 నుండి 2 లవంగాలు తీసుకోవడం ఆరోగ్యానికి సురక్షితం.

ఉదయాన్నే పరగడుపున లేదా రాత్రి పడుకునే ముందు ఒక లవంగం నమలి, గోరువెచ్చని నీరు తాగడం ఉత్తమమైన పద్ధతి.

క్రీడలు

# హైదరాబాద్ క్రికెట్‌లో కొత్త అధ్యాయం: సిరాజ్ చేతికి జట్టు పగ్గాలు!




హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా 'మియా మ్యాజిక్': మహమ్మద్ సిరాజ్‌కు బిగ్ ప్రమోషన్! భారత క్రికెట్ రంగాన తన సంచలన బౌలింగ్‌తో 'మియా మ్యాజిక్' సృష్టిస్తున్న హైదరాబాద్ స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ మరో మైలురాయిని చేరుకున్నాడు. రాబోయే 2026-27 రంజీ ట్రోఫీ సీజన్‌కు గాను హైదరాబాద్ సీనియర్ పురుషుల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా సిరాజ్ ఎంపికయ్యాడు. ఈ మేరకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు అనుభవజ్ఞుడైన పేసర్ చామా మిలింద్ ను ఉప-కెప్టెన్ (వైస్ కెప్టెన్)గా బాధ్యతలు చేపడతారని, సిరాజ్ జాతీయ జట్టు విధుల్లో ఉన్న సమయంలో మిలింద్ జట్టు పగ్గాలు చూసుకుంటారని ఎజా తెలిపింది. నాయకత్వ పగ్గాలు.. హైదరాబాద్ స్పెషల్ ఛాలెంజ్ఈసారి రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు 'ఎలైట్ గ్రూప్-బి' లో నిలిచింది. ఈ గ్రూప్‌లో సౌరాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అసోం, మరియు త్రిపుర వంటి బలమైన జట్లు ఉన్నాయి. తొలి మ్యాచ్: అక్టోబర్ 11న ప్రారంభమయ్యే రంజీ సీజన్ మొదటి పోరులో హైదరాబాద్ జట్టు త్రిపురతో తలపడనుంది. గతంలో రాహుల్ సింగ్ స్థానంలో కొన్ని మ్యాచ్‌లకు సిరాజ్ తాత్కాలికంగా కెప్టెన్‌గా వ్యవహరించినప్పటికీ, ఈసారి పూర్తిస్థాయి సీజన్ కోసం సారథ్య బాధ్యతలు స్వీకరించడం అతని నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనం. ఫామ్ అండ్ రిథమ్: లంక టూర్ నుంచి దులీప్ ట్రోఫీ వరకుఇటీవల శ్రీలంక పర్యటనలో సిరాజ్ సాధారణ బౌలింగ్ వేగం (140 నుండి 120-130 ఖవీఎంకి తగ్గినట్లు క్రీడా విశ్లేషకులు చర్చించారు. దీనిపై సిరాజ్ స్పందిస్తూ: "సుదీర్ఘ విరామం (రెండు నెలలు) తర్వాత నేరుగా అంతర్జాతీయ మ్యాచ్ బరిలోకి దిగడం వల్ల రన్-అప్ అడుగులు సరిగ్గా కుదరక రిథమ్ తగ్గింది. నేను పూర్తిగా లయపై ఆధారపడే బౌలర్‌ను. దేశం తరపున ఆడుతున్నప్పుడు ఎలాంటి సాకులు చెప్పలేం. తాజాగా ముగిసిన దులీప్ ట్రోఫీ ఫైనల్‌తో తిరిగి నా పూర్తి ఫామ్‌ను అందుకోగలిగాను". సత్తా చాటేందుకు సిరాజ్‌కు సరైన సమయం!టీమ్ ఇండియా తరపున బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ, దేశవాళీ మ్యాచ్‌ల్లో ఆడటం తన ఫిట్‌నెస్‌ను, పేస్‌ను స్థిరంగా ఉంచుకోవడానికి ఎంతో సహాయపడుతుందని సిరాజ్ భావిస్తున్నాడు. తెలంగాణ డీఎస్పీ హోదా కలిగిన సిరాజ్‌కు ఈ కెప్టెన్సీ ప్రమోషన్ గొప్ప గౌరవంగా భావిస్తున్నారు. ఈ రంజీ సీజన్లో తన పదునైన పేస్ బౌలింగ్‌తో పాటు, సరైన వ్యూహాలతో హైదరాబాద్ జట్టును విజేతగా నిలిపేందుకు సిరాజ్ సిద్ధమవుతున్నాడు!

# అలియాస్ రుక్మిణీ' మూవీ ఫస్ట్ షెడ్యూల్ పూర్తి

# సినిమా

'కోర్ట్ ? స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' అద్భుత విజయం తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్, నితిన్ హీరో నటిస్తున్న 'అలియాస్ రుక్మిణీ' సరికొత్త ప్రాజెక్ట్‌తో వస్తోంది. తన తొలి చిత్రం 'దండోరా'తో విమర్శకులను ఆకట్టుకున్న మురళీకాంత్ దేవసోత్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు. దీప్తి గంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఒక ఆసక్తికరమైన కథతో కూడిన విలక్షణమైన ప్రపంచాన్ని ఆవిష్కరించేలా ఉంటుంది.'అలియాస్ రుక్మిణి' 10 రోజుల మొదటి షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసుకుంది. చిత్ర బృందం ప్రధాన తారాగణంతో కూడిన కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించింది. ఈ షూట్‌లో హీరో నితిన్‌తో పాటు సాయి కుమార్, హర్ష వర్ధన్, ఇతర ప్రముఖ నటులు పాల్గొన్నారు. యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నాని సమర్పకుడిగా వ్యవహరించడం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెంచుతోంది. లైట్ హార్ట్ హాస్యంతో కూడిన గ్లింప్స్‌కు




అద్భుతమైన స్పందన లభించింది. ఈ సినిమాలో నితిన్ చాలా యూనిక్ క్యారెక్టర్ లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి జోమోన్ టి. జాన్ ఐఎస్‌సి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా, విజయ్ బల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్. తారాగణం: నితిన్, సాయి కుమార్, హర్ష వర్ధన్

# కౌబాయ్ అండ్‌ఇండియన్" హాలీవుడ్ మూవీ త్వరలో రిలీజ్

వరుస ఆంగ్ల చిత్రాల్లో నటిస్తూ హాలీవుడ్ లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు తెలుగు హీరో మహేశ్ శ్రీరామ్. ఆయన ప్రస్తుతం వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న "ఫణి" చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ప్రమోషనల్ కంటెంట్ తో ఇప్పటికే "ఫణి" సినిమా మీద మూవీ లవర్స్ లో మంచి అంచనాలు ఏర్పడుతున్నాయి. మరోవైపు మహేశ్ శ్రీరామ్ హాలీవుడ్ లో నటించిన "కౌబాయ్ అండ్ ఇండియన్" సినిమా రేపు గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. ఈ చిత్రంలో ప్రముఖ హాలీవుడ్ నటుడు బ్రాడ్ నాప్ పోషించిన స్టీవ్ క్యారెక్టర్ కు స్నేహితుడు విజయ్ పాత్రలో మహేశ్ శ్రీరామ్ నటించారు. స్నేహితుడి అభిప్రాయాలకు విలువనిస్తూ అతని చెప్పే మాటల్ని




అర్థం చేసుకుని సపోర్ట్ గా నిలిచే మిత్రుడు విజయ్ క్యారెక్టర్ లో మహేశ్ శ్రీరామ్ తన పర్ ఫార్మెన్స్ తో ఆకట్టుకోనున్నారు. డైరెక్టర్ లియో పి షెల్లీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హాలీవుడ్ లో ఇలా ఎగ్జైటింగ్ మూవీస్ లో నటిస్తున్న మహేశ్ శ్రీరామ్ "ఫణి" సినిమాలో లీడ్ రోల్ చేస్తుండటం ఈ మూవీకి మరింత క్రేజ్ తీసుకొస్తోంది.

# "ది ప్యారడైజ్" మూవీలో యాక్షన్ నెక్ట్స్ లెవల్‌లో ఉంటుంది..

# ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్




న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.ప్యారడైజ్‌కు ఎంతమంది ఫైట్ మాస్టర్స్ పనిచేశారు?

మేము, నవకాంత్, రియల్ సతీష్ పనిచేశాం. ఇందులో మేం రెండు భారీ యాక్షన్ బ్లాక్స్ కంపోజ్ చేశాం.

నాని గారి క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?

నాని గారి క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ గారు చాలా కొత్తగా డిజైన్ చేశారు. రెండు జడలు వేసుకున్న హీరోను ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు చూడలేదు. మాకు కూడా అది చాలా కొత్తగా అనిపించింది. నాని గారు ప్రేక్షకులకు కొత్తదనం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.-నాని గారు ఈ స్థాయిలో యాక్షన్ చేయడం ఇదే మొదటిసారి. ఇందులో యాక్షన్ సీన్స్ చాలా హెవీగా ఉంటాయి. 'దసరా' కంటే మూడు రెట్లు ఎక్కువ యాక్షన్ ఉంటుంది.-జడలతో యాక్షన్ సీక్వెన్స్ చేయడం మామూలు విషయం కాదు. యాక్షన్ చేస్తున్నప్పుడు ఆ జడలు రూప్‌లకు, ముఖానికి తగులుతుంటాయి. అలాంటి యాక్షన్ సీక్వెన్స్ చేయడం మాకు కూడా కొత్త అనుభవమే. మా అసిస్టెంట్‌కు కూడా అలాంటి జడలు వేయించి అందులో ఉండే కష్టం తెలుసుకుని మరీ యాక్షన్‌ను కంపోజ్ చేశాం. -నాని గారి కెరీర్‌లోనే ఇంత కష్టం ఎప్పుడూ పడలేదు. ప్రతి విషయంలో తన 100 శాతం కష్టపడ్డాడు. ఎన్ని టేక్స్ అయినా చేయాలని మనసులో ఫిక్స్ అయ్యాడు. నిజంగా నాని ఇంత కష్టపడతాడని మేం ఊహించుకోలేదు. అంత గొప్పగా ఈ సినిమా కోసం కష్టపడ్డాడు. -నాని బేర్ బాడీతో చేసే యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయి. అవి స్క్రీన్‌పై చేయడం అంత ఈజీ కాదు. బాడీ బిల్డింగ్ చేయాలి. డైటింగ్‌లో ఉండాలి. ఇందులోనూ దర్శకుడు శ్రీకాంత్ తనకు అనుకున్నది వచ్చేంతవరకు రాజీపడరు. శ్రీకాంత్ తీసుకున్న విజన్‌కు నాని 100 శాతం న్యాయం చేశారు. అందులో మేం భాగమవడం అదృష్టంగా భావిస్తున్నాం.యాక్షన్ బ్లాక్స్ పూర్తి చేయడానికి ఎన్ని రోజులు పట్టింది?

-మా యాక్షన్ బ్లాక్స్ పూర్తి చేయడానికి దాదాపు పది రోజులు పట్టింది. ఇందులో కొత్త మనుషులు, కొత్త బాడీ లాంగ్వేజ్.. అంతా కొత్తగానే ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఎంచుకున్న కథ సహజంగానే యాక్షన్‌ను డిమాండ్ చేస్తుంది. ఇందులో తప్పించుకోవడానికి అవకాశం ఉండదు.. ఫైట్ చేయాల్సిందే. అలాంటి పరిస్థితిని శ్రీకాంత్ క్రియేట్ చేశారు.

-యాక్షన్‌ను కంపోజ్ చేయడానికి చాలా సమయం తీసుకున్నాం.

# చేయూత పెన్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

(గద్వాల,జనసమయం ప్రతినిధి)

ప్రభుత్వం కొత్తగా చేయూత పెన్షన్లను ఇచ్చేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నందున వాటిని క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పర్యటించి పరిశీలించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి పెన్షన్లు, ఎస్ఐఆర్, తదితర అంశాలపై అన్ని మండలాల తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. పెన్షన్లకు దరఖాస్తు చేసుకునే భవిత కేంద్రాల్లోని వికలాంగులైన చిన్న పిల్లలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర వర్గాల వారు కూడా పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకోవడంతో అర్హులైన వారిని పారదర్శకంగా ఎంపిక చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఆయా మండలాల వారీగా దరఖాస్తుదారుల వివరాలను నోటీసు బోర్డులో ప్రకటించాలన్నారు. వీటిపై ఎవరి నుండైనా ఏమైనా అభ్యంతరాలు వస్తే మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి నివేదించాలన్నారు. అర్హులైన వారందరికీ సదరం సర్టిఫికెట్స్ నిబంధనల ప్రకారం మంజూరు చేయాలన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ ఇంకొంత చేయాల్సి ఉన్నందున బిఎల్ఓ లు నిబద్ధతతో పని చేయాలన్నారు. సంబంధిత సిబ్బంది హియరింగ్ కు రాని ఓటర్ల ఇంటికి స్వయంగా వెళ్లి అవసరమైన డాక్యుమెంట్స్ సేకరించాలని ఆదేశించారు. ఏ, బి, సి కేటగిరీల వారీగా ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డులలో అవసరమైన పత్రాలను సేకరించి యాప్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఏఈఆర్ఓలు, అదనపు ఏఈఆర్వోలు నిరంతరం క్షేత్రస్థాయిలో సంబంధిత సూపర్వైజర్లు, బిఎల్ఓ ల పనితీరుపై పర్యవేక్షణ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ఆయా




గ్రామ పంచాయతీలలో చేసిన పనుల బిల్లులను పరిశీలించి జిల్లా పంచాయతీ కార్యాలయంకు వివరాలను పంపించాలన్నారు. జలసిరి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా పెద్ద ఎత్తున పంట పొలాల్లో నీటి కుంటలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోర్ వెల్స్ రీచార్జెస్ పనులను చేపట్టాలన్నారు. వివిధ టాయిలెట్స్ నిర్మాణాలకు కూడా శాంక్షన్ చేయించుకొని పనులు చేపట్టాల్సి ఉండగా కొంతమంది అధికారులు నిర్లిప్తంగా ఉండడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన దినోత్సవంను అన్ని కార్యాలయాల్లో నిర్వహించాలని, వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. సాదా బైనమా, భూభారతి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, రీసర్వే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, ఏపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# లండన్‌లో అంబేద్కర్ స్మృతి భవనాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**(మహబూబ్ నగర్,జనసమయం ప్రతినిధి)**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నత విద్యను అభ్యసించిన రోజుల్లో లండన్‌లో నివసించిన చారిత్రక భవనాన్ని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, సందర్శించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్మృతి భవనంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తన జీవితకాలంలో ఈ భవనంతో కలిగి ఉన్న అనుబంధానికి గుర్తుగా భారత ప్రభుత్వం ఈ భవనాన్ని కొనుగోలు చేసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్మృతి భవన్‌లి 'గా అభివృద్ధి చేసిందని తెలిపారు. అంబేద్కర్ విద్యాభ్యాసం, ఆయన ఆలోచనా విధానం, సామాజిక న్యాయం కోసం సాగించిన పోరాటంతో ముడిపడి ఉన్న ఈ చారిత్రక ప్రదేశాన్ని సందర్శించడం ఎంతో గర్వంగా ఉందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. విద్యకు అంబేద్కర్ ఇచ్చిన ప్రాధాన్యత, జ్ఞానం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలన్న ఆయన ఆలోచనలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంలో అంబేద్కర్ పోషించిన పాత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని అన్నారు. అంబేద్కర్



ఆశయాలు, రాజ్యాంగ విలువలను కాపాడుతూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

# గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**(మహబూబ్ నగర్,జనసమయం ప్రతినిధి)**

మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రతిష్ఠించిన శ్రీ గణపతి విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె కోరారు. జిల్లాలో వినాయక చవితి వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించి పండుగను సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయిశివాని,



క్లాస్-4 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్,ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Editor, Publisher & Owner, & Place of Publication: V. YADAMMA H.No. C154,Parvathapur Village,Ghanapur Mandal Wanaparthy Dist.Telangana - 509380, email : janasamayam@gmail.com, Cell : 9381205266,8977022449 Printed at : Mythri Art Printers, Shop No. 10, Dcc Bank Complex, Mahabubnagar,Telangana-509001.
Office : H.No. 4-42-332, Chennareddy Nagar, Asbestos Colony, Hyderabad (TG) 500037 www.janasamayam.com